RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 266 మేడ్చల్ మల్కాజ్‌గిరి 19 అక్టోబర్ 2024 శనివారం పేజీలు : 4

## సుప్రీంకోర్టు తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్ర చూడ్ తన వారసుడి పేరును ప్రకటించారు. తదుపరి చీఫ్ జస్టిసగా జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ఆయన సిఫారసు చేశారు. వచ్చేనెల 10వ తేదీన జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలం ముగియనుంది. దిగిపోయే ముందు సుప్రీంకోర్టులోని సీనియర్ న్యాయమూర్తి పేరును చీఫ్ జస్టిస్ పదవికి సిఫారసు చేయడం ఆనవాయితీ. ఈ సంప్రదాయాన్ని అనుసరించి జస్టిస్ సంజీవ్ ఖన్నా పేరును ప్రతిపాదిస్తూ కేంద్ర న్యాయశాఖకు జస్టిస్ చంద్రచూడ్ లేఖ రాశారు. అనంతరం.. కేంద్ర న్యాయశాఖ ప్రధానమంత్రి పరిశీలనకు పంపుతుంది. ప్రధాని ఆమోదం తర్వాత రాష్ట్రపతి సిఫారసుకు పంపుతారు. చివరిగా రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి నియామక ప్రక్రియ పూర్తవుతుంది.



## స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కును అందజేశారు.

సీఎస్ శాంతి కుమారి, దానకిశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించే ఉద్దేశంతో ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ప్రాధాన్యం ఉన్న ఆరు కోర్సులతో మొదలు పెట్టి క్రమంగా కోర్సులను పెంచనున్నారు. ఈ వర్సిటీకి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్‌మహీంద్రా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.




## గ్రూప్ 1 అభ్యర్థులకు బిగ్ షాక్.. కీలక తీర్పు..

తెలంగాణ గ్రూప్ 1 పరీక్ష రాసే అభ్యర్థులకు బిగ్ షాక్ ఇచ్చింది రాష్ట్ర హైకోర్టు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు హైకోర్టు డివిజన్ బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరీక్షలు వాయిదా వేయాలన్న గ్రూప్ - 1 అభ్యర్థుల రిట్ అప్పీల్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది.

ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 పరీక్షాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 31,383 మంది అభ్యర్థులు గ్రూప్ 1 పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఆంక్షలు విధించారు అధికారులు.

బీఎన్ఎస్ఎస్ 163 యాక్ట్ ప్రకారం పరీక్షా కేంద్రాల వద్ద ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమికూడరాదని హెచ్చరించారు.

**సుప్రీంకోర్టును ఆశ్రయించిన అభ్యర్థులు..** ఇదిలాఉంటే.. తెలంగాణ గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 29 వల్ల జరిగే నష్టాన్ని ప్రధాన న్యాయమూర్తికి తమ న్యాయవాది వివరించారని విద్యార్థులు చెప్పారు. సోమవారం రోజు మొదటి కేసుగా తీసుకొని విచారిస్తామని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రకటిస్తూ విచారణను వాయిదా వేశారు. జీవో 55నే అమలు చేయాలని విద్యార్థులంతా కోరినా.. సీఎం పెడచెవిన పెట్టారని గ్రూప్ 1 అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టుతో మొట్టికాయలు కొట్టించుకోక ముందే ప్రభుత్వం దిగివచ్చి జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా గురించి మాట్లాడుతున్న సీఎం.. జీవో 29 వల్ల నష్టపోయే విద్యార్థుల గురించి ఎందుకు స్పందించడం లేదని గ్రూప్ 1 అభ్యర్థులు నిలదీస్తున్నారు.


## అన్నదాతలకు సీఎం రేవంత్ సర్కార్ మరో గుడ్ న్యూస్!

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన మార్క్ చాటుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాదు.. ఇతర అభివృద్ధి సంక్షేమ పథకాలకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీ పథకాల్లో మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500 లకే గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలు అమలు చేస్తున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు తగు పరిహారం కూడా చెల్లించారు. తాజాగా అన్నదాతలకు మరో గుడ్ న్యూస్ చెప్పింది తెలంగాణ సర్కార్. పూర్తి వివరాల్లోకి వెళితే.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం ఆరు గ్యారెంటీ పథకాలపై చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తుందని పలు సందర్భాల్లో చెబుతూ వచ్చారు రేవంత్ రెడ్డి. ఈ క్రమంలోనే తెలంగాణ రైతుకుల మరో అదిరిపోయే శుభవార్త చెప్పింది తెలంగాణ సర్కార్. త్వరలోనే రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీని కూడా ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతులకు వచ్చే నెల నుంచి విడతల వారీగా రుణమాఫీ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. రెండు లక్షల లోపు పంట రుణాలున్న రైతులు ఇంకా నాలుగు లక్షల మందివరకు ఉన్నట్లు ప్రభుత్వ అధికారులు అంటున్నారు. వీరందరికీ దీపావళి పండుగ లోపే సాయం అందజేసేలా ఏర్పాట్లు చేస్తామని మంత్రి తుమ్మల అన్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల సమయంలో రైతు భరోసా సాయాన్ని రూ.15వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రెండు విడతల్లో రూ.7500 చొప్పున రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించనుంది. ఇది కూడా త్వరలో అమలు చేస్తామని తుమ్మల





తెలిపారు. ఈ నెలాఖరు నాటికి రుణమాఫీతో పాటు రైతు భరోసా నిధులు కూడా విడుదల అవుతాయని.. దీపావళికి రెండు కానుకలు అందినట్లు అవుతుందని మంత్రి తుమ్మల అన్నారు. అలాగా వరి పంట వేసే రైతులకు క్వింటాల్ కు రూ. 500 బోనస్ కూడా అందిస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కూడా ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి తెలిపారు.




## మూసీ సుందరీకరణ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం

హైదరాబాద్: అబద్ధమే ఆశ్యర్యపడేలా సీఎం రేవంత్ గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించారని భారాస నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఎలాంటి ఆలోచన లేకుండా సీఎం మాట్లాడుతున్నారని.. మూసీకి ఆయన ఇచ్చిన నిర్వచనాలు విని జనం నవ్వుతున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. "ప్రెస్‌మీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఏఐ టెక్నాలజీని చూపించారు. నీటితో కళకళలాడేలా నదిని బాగు చేయడమే పునరుజ్జీవం. రివర్‌ఫ్రంట్ అంటే ఏంటి.. దాని స్టంట్ ఏంటో సీఎం చెప్పాలి. నదిని శుభ్రం చేయడం నుంచే పనులు ప్రారంభం కావాలి. మూసీ సుందరీకరణలో భాగంగానే మేం 31 ఎస్టీపీలు నిర్మించాం. పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలవకుండా చర్యలు చేపట్టాలి. అసలు పని వదిలిపెట్టి ఇళ్లు కూలగొట్టడంపై దృష్టిపెట్టారు. శని, ఆదివారాలు చూసి పేదల ఇళ్లపై దాడి చేయడం దుర్మార్గం. మూసీ సుందరీకరణ పేరుతో, ఫార్మాసిటీకి మేం సేకరించిన భూమితో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు" అని హరీశ్‌రావు విమర్శించారు.




## కేసీఆర్‌కు చంద్రబాబు

## మరో రిటర్న్ గిఫ్ట్

## గురి చూసి కొడితే సంవత్సరంలో బీఆర్ఎస్‌కి చుక్కలే!

తెలుగుదేశం అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కేసీఆర్ విషయంలో టిట్ ఫర్ టాట్ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారా? 2019లో తెలుగుదేశం పార్టీ ఓటమిపై కేసీఆర్ చేసిన రిటర్న్ గిఫ్ట్ వ్యాఖ్యలకు చంద్రబాబు ఇప్పుడు అదే రీతిలో బదులు చెప్పడానికి రెడీ అయిపోయారా? ప్రత్యర్థులకు అందని వ్యూహాలతో చెలరేగిపోతారన్న పేరున్న కేసీఆర్ చంద్రబాబు ఎత్తులతో చతికిలపడిపోయారా? అంటే పరిశీలకులు ఔననే అంటున్నారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో బీఆర్ఎస్ పరాజయానికి చంద్రబాబు వ్యూహాత్మకంగా తెలుగుదేశం పార్టీని పోటీకి దూరంగా ఉంచడమే ప్రధాన కారణమని అంటున్నారు. సరే అది పక్కన పెడితే.. ఆంధ్రప్రదేశ్ లో చారిత్రాత్మక విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు తెలంగాణలో బలోపేతంపై దృష్టి సారించింది. చంద్రబాబు నాయుడు తెలంగాణలో పార్టీకి పూర్వవైభవం తీసుకురావడంపై నజర్ పెట్టారు. కారణాలేమైతేనేం.. రాష్ట్ర విభజన తరువాత తెలంగాణలో తెలుగుదేశం నేతలు చాలా వరకూ తమ దారి తాము చూసుకున్నారు. పార్టీని వీడారు. అయితే పార్టీ క్యాడర్ మాత్రం చెక్కుచెదరలేదు. ఆ విషయం విభజన తరువాత జరిగిన ప్రతి ఎన్నికలోనూ ప్రస్ఫుటంగా అవగతమైంది. తెలంగాణలో ఏ ఎన్నిక జరిగినా... పార్టీలన్నీ తెలుగుదేశం క్యాడర్ మద్దతు కోసం ప్రాకులాడాయి, ప్రయత్నించాయి. ఆ పార్టీ క్యాడర్ మద్దతు పొందిన పార్టీనే విజయం వరిస్తుందన్న నమ్మకమే ఇందుకు కారణం. అది కేవలం నమ్మకం కాదు.. నూటికి నూరుపాళ్లూ వాస్తవం అన్న సంగతి 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో సందేహాలకు అతీతంగా రుజువైంది. ఎవరు ఔనన్నా కాదన్నా తెలంగాణలో తెలుగుదేశం పార్టీ చాలా బలంగా ఉంది. తెలంగాణలో తెలుగు దేశం పార్టీకి నేతలు లేరు కానీ కార్యకర్తలు మాత్రం పార్టీ పట్ల విశ్వాసంతో, అంకిత భావంతో పని చేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నారు.. ఉంటారు. రాష్ట్ర విభజన అనంతర రాజకీయ పరిణామాల కారణంగా రాష్ట్రంలో తెలుగుదేశం యాక్టివ్ రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ ఆ పార్టీ పునాదులు రాష్ట్రంలో ఇసుమంతైనా చెక్కు చెదరలేదు. పార్టీ అధినేత చంద్రబాబు ఒక్క పిలుపు ఇస్తే చాలు ఇక్కడ జెండా ఎగురవేయడానికి క్యాడర్ సిద్ధంగా ఉంది. ఈ విషయం గత ఏడాది డిసెంబర్ లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో అన్ని పార్టీలూ తెలుగుదేశం జెండా పట్టడంతో మరోసారి రుజువైంది. ఇక ఇప్పుడు రాష్ట్రంలో పార్టీపై చంద్రబాబు దృష్టి పెట్టడం అంటే బీఆర్ఎస్ ఉనికి మాత్రంగా కూడా మిగిలే అవకాలు అంతంత మాత్రంగానే ఉంటాయని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రిగా తాను ఎంత బిజీగా ఉన్నా తెలంగాణలో పార్టీ కోసం సమయం కేటాయిస్తానని విస్పష్టంగా ప్రకటించిన చంద్రబాబు. తెలంగాణలో స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం పోటీ చేస్తుందని ప్రకటించారు. దీంతో ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న బీఆర్ఎస్ బేజారైపోయింది. హైడ్రా, రుణమాఫీ, రైతు బంధు వంటి విషయాల్లో రేవంత్ సర్కార్ తీరును ప్రశ్నిస్తూ ఇప్పుడిప్పుడే ప్రజలలోకి వస్తున్న బీఆర్ఎస్ నేతలు తెలుగుదేశం ఎంట్రీతో జావగారిపోతున్నారు. ఎందుకంటే తెలంగాణలో తెలుగుదేశం కోసం అంకిత భావంతో పని చేసే కార్యకర్తలు ఉన్నారు. ఈ పదేళ్ల కాలంలో వారంతా ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ కు మద్దతు ఇస్తూ వచ్చారు. ఆ మద్దతు 2023 ఎన్నికలలో లభించకపోవడంతోనే బీఆర్ఎస్ పరాజయం పాలయ్యింది. ఇప్పుడు మళ్లీ తెలంగాణ తెలుగుదేశం దగ్గరకు వస్తే.. పార్టీకి బలమైన పునాదులు ఉన్నాయి. వాటిని చెక్కు చెదరకుండా కాపాడుతున్న క్యాడర్ ఉంది. మరి రాష్ట్రంలో పార్టీని ముందుండి నడిపించే నాయకుడు ఎవరు అంటే మాత్రం సమాధానం దొరకదు. అందుకే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా.. ఆ రాష్ట్ర అభివృద్ధి కోసం క్షణం తీరిక లేకుండా ఉన్నప్పటికీ.. తరచుగా హైదరాబాద్ వచ్చి ఎన్టీఆర్ భవన్ లో క్యాడర్ కు అందుబాటులో ఉండాలని నిర్ణయించుకున్నారు. అదే విధంగా రాష్ట్రంలో పార్టీకి సమర్థుడైన అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. ఒక సారి చంద్రబాబు తెలంగాణలో పార్టీపై దృష్టి పెట్టాననీ, పూర్వ వైభవం దిశగా పార్టీని నడిపిస్తాననీ ప్రకటించగానే.. ఇంత కాలం అక్కడా ఇక్కడా సర్దుకుని పబ్బం గడిపేస్తున్న మాజీలంతా తెలుగుదేశం వైపు చూస్తున్నారు. ఆ సంగతి అలా ఉంచితే.. ఇంత కాలం పార్టీలో ఉంటూ కూడా ఏ మాత్రం క్రియాశీలంగా లేని నేతలు అలర్ట్ అయిపోయారు. పార్టీని అంటిపెట్టుకుని ఉన్నామని చెప్పుకుంటూ పార్టీ పదవుల కోసం రేసులోకి వచ్చేస్తున్నారు. ఈ పదేళ్లలో పట్టుమని పది సార్లు కూడా ఎన్టీఆర్ భవన్ లో అడుగుపెట్టని నేతలు సైతం తామే పార్టీకి ఇంత కాలం పెద్దదిక్కుగా ఉన్నామని చెప్పుకోవడానికి పోటీలు పడుతున్నారు. ఇలా పార్టీ పదవి కోసం అర్రులు చాస్తున్న వారిలో కార్యకర్తలలో పలుకుబడి ఉన్నవారెవరు అంటే ఎవరూ కనిపించని పరిస్థితి ఉంది. రాష్ట్రంలో పదేళ్లుగా పార్టీకి పెద్దదిక్కుగా ఉన్నామంటూ చెప్పుకుంటూ చొక్కాలు చించేసుకుంటున్న వారెవరికీ పార్టీ క్యాడర్ లో ఇసుమంతైనా పలుకుబడి లేదు. తెలంగాణలో తెలుగుదేశం ఉంది. చాలా బలంగా ఉంది. అయితే ఆ పార్టీకి రాష్ట్రఅధ్యక్ష పదవి మాత్రం ఖాళీగా ఉంది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆ పదవి ఖాళీ అయ్యింది. అప్పట్లో తెలుగుదేశం రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. అప్పటి నుంచీ రాష్ట్రంలో పార్టీ అధ్యక్షుడన్న వాడే లేకుండా పోయారు. తెలంగాణలో ఎన్నికల బరి నుంచి తెలుగుదేశం తప్పుకోవడంతో అప్పట్లో పార్టీ అధ్యక్ష పదవిని భర్తీ చేయడానికి చంద్రబాబు ఏం తొందరపడలేదు. అయితే ఇప్పుడు స్థానిక ఎన్నికలలో పార్టీ పోటీలో ఉంటుందని స్వయంగా చంద్రబాబే ప్రకటించారు. దీంతో ఇక పార్టీ అధ్యక్షుడి ఎన్నిక లేదా ఎంపిక సత్వరమే జరగడం ఖాయం. ఇప్పుడిక రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో చంద్రబాబు ఉన్నారన్నది స్పష్టం కావడంతో రాష్ట్ర విభజన తరువాత పార్టీని వీడి ఇతర పార్టీలలో చేరి అక్కడ ఇమడలేక ఉక్కపోతకు గురి అవుతున్న పలువురు తెలుగుదేశం మాజీ నాయకులు హోం కమింగ్ అంటూ తెలుగుదేశం గూటికి చేరడానికి క్యూకడుతున్నారు. దీంతో బీఆర్ఎస్ కంగారు పడుతోంది. కంగాళీ అవుతోంది. రాష్ట్రంలో తెలుగుదేశం బలపడితే.. తమ రాజకీయ భవిష్యత్ అగమ్యగోచరమేనని బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు గురౌతున్నారు. సరిగ్గా స్థానిక ఎన్నికల ముందు రాష్ట్రంలో పార్టీ పటిష్ఠతమై చంద్రబాబు దృష్టి సారించడం అంటే కేసీఆర్ కు రెండో రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడమేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## సంపాదకీయం

# ఏమిటీ స్టెల్త్ బాంబర్..?

ఓవైపు ఇజ్రాయెల్ తో హమాస్, హెజ్బొల్లా, ఇరాన్ లు యుద్ధం చేస్తుండగా.. ఉన్నపళంగా హౌతీ ఉగ్రవాదులపై విరుచుకుపడింది అమెరికా. అదికూడా అలా ఇలా కాదు.. శక్తిమంతమైన స్టెల్త్ బాంబ్లరతో దాడి చేసింది. కొన్నాళ్లుగా ఎర్ర సముద్రంలో తమ నౌకలను టార్గెట్ చేస్తున్న హౌతీలను చావుదెబ్బ కొట్టే లక్ష్యంతో అమెరికా తొలిసారి బి-2 స్టెల్త్ బాంబర్లను ఎక్కుపెట్టడం గమనార్హం. దీంతో గురువారం తెల్లవారుజామున యెమెన్ కు స్టెల్త్ బాంబర్ల మోతతో తెల్లారినట్లైంది. తమ దాడుల్లో అమెరికా యెమెన్ ఆయుధ డిపోలను లక్ష్యం చేసుకుంది.

**ఏమిటీ స్టెల్త్ బాంబర్..? :** బాంబులంటే బాంబులే.. అయితే, బాంబులందు స్టెల్త్ బాంబులు వేరయా? అనే చెప్పాలి. సాధారణ యుద్ధ విమానాల (ఫైటర్ జెట్ల)తో పోలిస్తే అమెరికా బి-2 స్టెల్త్ బాంబర్ అత్యంత శక్తిమంతమైనది. దీని ప్రత్యేకత ఏమంటే.. అత్యంత దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా తేలిగ్గా కొట్టేయడం. ఇంకా ఏమంటే.. అతిపెద్ద భారీ బాంబులనూ మోసుకెళ్తుంది. ఏడాది నుంచి హౌతీలు ఇబ్బంది పెడుతున్నా.. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ఎందుకని అనుకుందో ఏమో కానీ.. అమెరికా బి-2 స్టెల్త్ బాంబర్లను ప్రయోగించలేదు.

**ఇప్పుడు యుద్ధం ముదరడంతో..** హెజ్బొల్లా, హమాస్ లకు మద్దతుగా ఇజ్రాయెల్ పై ఇరాన్ కాలు దువ్వుతుండడం, హౌతీలూ దానికి కలిసిరానుండడంతో అమెరికా ఇక ఉపేక్షించాలని భావించలేదు. ఇప్పటివరకు సాధారణ ఫైటర్ విమానాలతోనే దాడులు చేసింది. ఇప్పుడు మాత్రం బి-2 స్టెల్త్ బాంబర్లను బరిలో దింపనున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పతాకస్థాయిలో ఉండడంతో అమెరికా దళాలు రంగంలోకి దిగుతున్నాయి. థాడ్ గగనతల రక్షణ వ్యవస్థను కూడా మోహరిస్తోంది. దీంతోనే యెమెన్ లో హూతీలను దెబ్బకొట్టాలని దాడి చేసింది. ఐదు భూగర్భ ఆయుధ డిపోలను బి-2 స్టెల్త్ బాంబర్లు ధ్వంసం చేశాయి. ఎర్ర సముద్రంలో పౌర నౌకలను లక్ష్యంగా చేసుకోవడానికి హౌతీలు ఆయుధాలను వీటిలోనే భద్రపరిచేవారు. శత్రువులు ఆయుధాలను ఎంత లోతుగా దాచినా వదిలిపెట్టబోమని అమెరికా స్పష్టం చేసింది. తమ బి2 స్టెల్త్ బాంబర్ కావాలంటే ప్రపంచవ్యాప్తంగా దాడి చేయగలదని నిరూపించామని అమెరికా తెలిపింది. కాగా హౌతీలను కుప్పకూల్చాలని అధ్యక్షుడు బైడెన్ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చారు. దీంతో ఇకమీదట వారికి నూకలు చెల్లినట్లేనని అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ వెల్లడించారు. ఎందుకంటే.. గాజాలో యుద్ధం మొదలైన నాటినుంచి హౌతీ లు ఎర్ర సముద్రంలోని నౌకలపై 100 డ్రోన్లు, క్షిపణి దాడులు చేశారు మరి.. వీటిలో అమెరికా నౌకలూ ఉన్నాయి.

# ఈఎన్టీ శస్త్ర చికిత్స నిపుణుల సేవలు ప్రశంసనీయం గవర్నర్

### వారానికి ఒక రోజు ఈఎన్టీ వైద్యులు ప్రజలకు ఉచిత సేవలను అందించడం
### ఉన్నతమైన వృత్తి, నిజమైన స్ఫూర్తిని ప్రదర్శించాలన్న గవర్నర్
### వైద్య రంగ నిపుణుల వృత్తిలో చూపే నిబద్ధతకు, నైపుణ్యానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు
### తూంకుంటలోని ఆలంక్రిత రిసార్ట్స్ లో మూడు రోజుల సౌత్ జోన్
### ఈఎన్టీ సర్జన్స్ సదస్సును ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ






శామీర్ పేట, ( గరుడ వార్త) : వైద్య రంగంలో ఈఎన్టీ శస్త్ర చికిత్స వైద్యులకు ప్రత్యేక స్థానం గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. శుక్రవారం శామీర్ పేట మండలం తూంకుంట పరిధిలోని అలంక్రిత రిసార్ట్స్ లో ఈఎన్టీ వైద్యుల అసోసియేషన్ ఆఫ్ ఓటోలాలింగాలాజిస్ట్ ఆఫ్ ఇండియా సౌత్ జోన్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ డిఎస్ దీనదయాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన మూడు రోజుల సౌత్ జోన్ ఈఎన్టీ సర్జన్స్ సదస్సు 2024 కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిచారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ప్రకృతి, సంస్కృతి, సైన్స్ అండ్ టెక్నాలజీ కలిసే బేసిక్స్ అండ్ బీయాండ్ అనే ఇతి వృత్తంతో నిర్వహిస్తుందన్నారు. సౌత్ జోన్ స్థాయిలో ఏర్పాటు చేసిన ఈఎన్టీ వైద్యుల సదస్సు వైద్య పరమైన ప్రయత్నం కాదని, ఈ వేధిక అత్యున్నత విజ్ఞానవేడుకని తెలిపారు. ఈఎన్టీ వైద్య రంగంలో అదునాతన పురోగతులపై చర్చించేందుకు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ సదస్సు వైద్యుల సహకారం, బాగస్వామ్య అభ్యాసస్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. చెవి, ముక్కు, గొంతు స్పెషాల్టీల సంరక్షణ, అభివృద్ధికి అంకితమైన నిపుణుల నిబద్ధతకు సంతోషిస్తున్నామని తెలిపారు. వైద్య రంగంలో ఈఎన్టీ విపరీతమైన అభివృద్ధిని సాధించిందన్నారు. ఈఎన్టీ శస్త్ర చికిత్సల్లో నిపుణుల నైపుణ్యం అసాదారణంగా ఉందని ఆయన చెప్పారు. వైద్య రంగంలో న్యూరో సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, తల, మెడ శస్త్ర చికిత్స వంటి సూపర్ స్పెషాల్టీలలో పనిచేయడానికి అనుమతిస్తున్నారని తెలిపారు. ఈ అభివృద్ధి కేవలం వైద్య పురోగతినే కాకుండా, ఈ రంగంలోని నిపుణులు తమ వృత్తిలో చూపే నిబద్ధతకు, నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. హైదరాబాద్ ముఖ్యమైన వైద్య కేంద్రంగా మారిందని, భారతదేశం నుంచే కాకుండ విదేశాల నుంచి సైతం రోగులను ఆకర్శిస్తుందన్నారు. ప్రత్యేకంగా హైదరాబాద్ నగరానికి ఈశాన్య రాష్ట్రాల నుంచి పెద్ద ఎతు న రోగులు వస్తున్నారని చెప్పారు. ఈ సదస్సుకు దక్షణాధి రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి అధ్యాపకులు రావడం గొప్ప ఆలోచనల మార్పిడికి ఒక వేధికగా నిలుస్తుందని గవర్నర్ తెలిపారు. చెవితో శబ్దం, ముక్కు తో సుగంధం మార్గం, గొంతు తో మాట వ్యక్తం అవుతుందని ఒక సంస్కృత స్లోకాన్ని గవర్నర్ వివరించారు. ఈ మూడు జీవిత సారాంశమని చెప్పారు. సున్నితమైన భాగాలతో పనిచేసే ఈఎన్టీ నిపుణులు కేవలం శస్త్ర వైద్యులే కాదని, మన ఇంద్రియాల జీవన నాణ్యతను కాపాడే ఎంతో గొప్ప వైద్యులనిఆయన వివరించారు. వారానికి ఒక రోజు ఈఎన్టీ వైద్యులు ప్రజలకు ఉచిత సేవలను అందించడం తో ఉన్నతమైన వృత్తి, నిజమైన స్ఫూర్తిని ప్రదర్శించాలని గవర్నర్ కోరారు.

నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అవసరమైన వారికి అందుబాటులో ఉండాలని, ధరలను ఘననీయంగా తగ్గించాలని గవర్నర్ సూచించారు. అసోసియేషన్ ఆఫ్ ఓటలారింగాలజిస్ట్ ఆఫ్ ఇండియా టీజీ సౌత్జోన్ కాన్ఫరెన్స్ ఆర్గనైజింగ్ ఛైర్మన్ డాక్టర్ దీనదయాళ్ మాట్లాడుతూ ఈ సదస్సు సాంకేతికత, ఈఎన్టి సేవలను ఎలా మారుస్తోందో అన్వేషించే కీలకమైన పరస్థితులను సూచిస్తుందని తెలిపారు. వైద్య రంగంలో ఈఎన్టీ వైద్య రంగం ఎంతగానో అభివృద్ధి చెందుతోందని ఆయన వెల్లడించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆరోగ్య సంరక్షణలు విప్లవాత్మకంగా మార్చబోతుందని ఆయన చెప్పారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా ఈఎన్టీ వైద్యులు, ప్రతినిధులు హాజరయ్యారు.

# అక్రమ డెప్యూటేషన్ లు తక్షణం రద్దు చేయాలీ : టిఎస్ యూటిఎఫ్ డిమాండ్



శామీర్ పేట (గరుడ వార్త) : అక్రమ డెప్యూటేషన్లు తక్షణమే రద్దు చేయాలంటూ టిఎస్ యూటిఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం శామీర్ పేట, మూడుచింతలపల్లి, ఘట్కేసర్ మండలంలోని నాయకులతో కలిసి వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ బదిలీల సందర్భంగా కౌన్సిలింగ్ ప్రక్రియలోని సాంకేతిక సమస్యల మూలంగా ఒక పాఠశాలకు బదులు మరొక పాఠశాలకు కేటాయించబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వందలాది టీచర్ల అప్పీళ్ళను పట్టించు కోవడం లేదని, 300 కి.మీ దూరంలో ఉన్న ములుగు జిల్లాల నుంచి మేడ్చల్ జిల్లా కు డెప్యూటేషన్ పై ఎలా తీసుకోస్తారని వారు ప్రశ్నించారు. టీచర్ లు ప్రజాప్రభుత్వం అని భావిస్తున్న ప్రస్తుత ప్రభుత్వంపై అక్రమ డిప్యూటేషన్ల వలన టీచర్ లు నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్వాకాలు గుర్తుకు తెచ్చే విధంగా వున్న ఈ ఉత్తర్వులు కొత్త తప్పుడు సంప్రదాయానికి తెరలేపే ప్రమాదం ఉందన్నారు. తక్షణం రద్దు చేసి ఉపాధ్యాయుల నమ్మకం కోల్పోకుండా చూడాలని వారు అన్నారు. బదిలీ అప్పీళ్లను వెంటనే పరిష్కరించి టీచర్ లకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యూటిఎఫ్ నాయకులు పి. మాణిక్ రెడ్డి, కె. జయసింహా రెడ్డి, మదన్ రెడ్డి, దేవజ నాయక్, పి.తిరుమలేశ, ఎం.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# జనన ధ్రువపత్రాలకు అగచాట్లు



జగిత్యాల : పురపాలక కార్యాలయంలో జనన, మరణ ధ్రువపత్రాల జారీ నెల రోజులుగా నిలిచిపోవడంతో దరఖాస్తులు పేరుకుపోయాయి. ఫలితంగా దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. గత 15 రోజుల్లో 600 జనన ధ్రువీకరణ దరఖాస్తులు అపరిష్కృతంగా మారాయి. కమిషనర్ అనిల్ పోలీసు కేసులో పరారీలో ఉండగా తరువాత ఇన్‌ఛార్జులుగా ఇద్దరు బాధ్యతలు చేపట్టడంతో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీకి నోచుకోలేకపోయాయి. తాజాగా పది రోజుల కిందట నూతన కమిషనర్‌గా సమ్మయ్య బాధ్యతలు చేపట్టినప్పటికీ ఇతరత్రా పనుల కారణంగా పూర్తిస్థాయిలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలేదు. ప్రతిరోజూ 80కి మించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేకపోవడంతో 500 దరఖాస్తులు నిలిచిపోయాయి.

**దరఖాస్తుదారుల ఇబ్బందులు..**

నిబంధనల మేరకు జనన, ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వారం రోజుల్లోపు అందజేయాల్సి ఉంది. గత 3 నెలలుగా బల్దియాలో పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతోపాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆధార్, విద్య, బీమా తదితర అన్ని అవసరాలకు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కావడంతో తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జగిత్యాల ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు స్థానిక పురపాలక కార్యాలయమే జారీ చేయాల్సి ఉంటుంది. సకాలంలో ధ్రువీకరణ పత్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మరణ ధ్రువీకరణ పత్రాలు నేరుగా బల్దియా కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. వీటిపైనా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు.

**ఆసుపత్రుల నిర్లక్ష్యం..**

ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు తమవద్ద జన్మించిన శిశువుల వివరాలు ప్రతినెలా బల్దియాకు అందజేయాల్సి ఉంటుంది. వీటి ఆధారంగానే బల్దియా జనన ధ్రువీకరణ పత్రాలు అందజేస్తోంది. స్థానిక సాధారణ ఆసుపత్రి సిబ్బంది కొన్ని నెలలుగా శిశువుల వివరాలు బల్దియాకు అందజేయకపోవడంతో ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రధానంగా 2023కు ముందు వివరాలు సాధారణ ఆసుపత్రి నుంచి ఇప్పటి వరకూ బల్దియాకు చేరవేయకపోవడం గమనార్హం. ఈ సమయంలో పుట్టిన శిశువుల ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో లభ్యం కాకపోవడంతో సాధారణ ఆసుపత్రి నుంచి మాన్యువల్‌గా వివరాలు కావాలని బల్దియా కోరుతోంది. ఈ క్రమంలో వివరాల కోసం దరఖాస్తుదారులు సాధారణ ఆసుపత్రికి వెళ్తే ఈ విభాగం ఇక్కడి నుంచి మాతాశిశు కేంద్రానికి తరలించారని చెబుతున్నారు. దరఖాస్తుదారులు ఎంసీహెచ్‌లో ఉన్న నాలుగో అంతస్తుకు వెళ్లి వాకబు చేస్తే ఆధార్, ఇతర జిరాక్స్‌ల కోసం తిప్పి పంపడంతో ప్రయాస పడాల్సి వస్తోంది. దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

**త్వరలోనే పూర్తి చేస్తాం**

దాదాపు జనన ధ్రువీకరణ పతాలు పెద్దమొత్తంలో జారీ చేశాం. మిగిలినవి రెండు మూడు రోజుల్లో పూర్తవుతాయి. మరణ ధ్రువీకరణ పత్రాలు మాత్రం ఇంకా జారీ కాలేదు. నేను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. త్వరలోనే అన్నింటిని దరఖాస్తుదారులకు అందజేస్తాం. – సమ్మయ్య కమిషనర్, జగిత్యాల

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 2,3 పరీక్షల పై చీఫ్ సెక్రటరీ వీడియో కాన్ఫరెన్స్...

### పాల్గొన్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 2,3 పరీక్షల పై సచివాలయం నుండి చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి, %TGPSC% చైర్మన్ మహేందర్ రెడ్డి, సభ్యులు తన కార్యాలయం నుండి శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతోఈ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సుకు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా





కలెక్టరు కార్యాలయము నుండి జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియ హాజరయ్యారు. నవంబరు 17, 18 తేదిలలో నిర్వహించనున్న గ్రూప్ 3 పరీక్షకు గాను జిల్లాలో 118 పరీక్షా కేంద్రాలలో 71,356 మంది అభ్యర్థులు హాజరుకాను న్నారని డిఆర్ఓ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 7 స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి

శామీర్ పేట, (గరుడ వార్త) : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని డీసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్, ఉద్దెమర్రి, కేశవరం గ్రామాలలో రైతులతో కలిసి ధాన్యము





కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అదికారి వెంకట్ రెడ్డి, మండల వ్యవసాయ అదికారి రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య, కార్యదర్శి శోభారాణి, డైరెక్టర్ లు భూమి రెడ్డి నర్సింహులు, బిక్షపతి, బాబు సింగ్, ప్రతాప్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు, మాజీఎంపీటీసీ, రైతులు పాల్గొన్నారు.

# విద్యుత్తు శాఖకు వరద షాక్..!

భానుపురి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు శాఖకు భారీ నష్టం జరిగింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురవడంతో విద్యుత్తు స్తంభాలు నేలకొరగటంతో పాటు, నియంత్రికలు కాలిపోయాయి. సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారు. వర్షాల కారణంగా జిల్లాలో నాలుగు సబ్‌స్టేషన్లు ముంపునకు గురయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిన అధికారులు సరఫరాను పునరుద్ధరించారు.

**కాలిన నియంత్రికలు.. కూలిన స్తంభాలు**

ఈదురుగాలులు, భారీ వర్షాలకు సూర్యాపేట జిల్లాలో 2127 విద్యుత్తు స్తంభాలు కూలిపోగా, 319 నియంత్రికలు కాలిపోయాయి. జిల్లాలోని కోదాడ మండలం నల్లబండగూడెం, అనంతగిరి మండలం గోండ్రియాల, మేళ్లచెరువు మండలం దొండపాడు, రామాపురం సబ్‌స్టేషన్లు ముంపునకు గురయ్యాయి. ఈదురు గాలుల ప్రభావంతో చెట్లు, కొమ్మలు విరిగిపడి విద్యుత్తు స్తంభాలపై పడటంతో 15, 33 కేవీ స్తంభాలు, 1074, 11 కేవీ స్తంభాలు, 1038, ఎల్టీ స్తంభాలు కూలిపోయాయి. జిల్లాలో బుధవారం తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ పర్యటించారు. విద్యుత్తు సంస్థకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు.

# ఆర్టీసీ ఖజానా.. గలగల!

తాండూరు : దసరా పండగ ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని తెచ్చింది. సాధారణ రోజులతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. మహిళా ప్రయాణికులతోపాటు నగదు టికెట్ ప్రయాణికులను కలిపి ఐదు రోజులుగా రెట్టింపు రాబడితో ఆర్టీసీ ఖజానా గలగలలాడింది. గతంతో పోలిస్తే ఈసారి ఆదాయం బాగుందని అధికారులు పేర్కొంటున్నారు.

**జిల్లాలో 240 బస్సులు**

జిల్లాలో మూడు డిపోల పరిధిలో 240 ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు ఉన్నాయి. తాండూరులో 96, పరిగిలో 72, వికారాబాద్‌లో 62 బస్సులున్నాయి. మూడు డిపోలు కలిపి ప్రతి రోజు లక్ష కిలోమీటర్ల ప్రయాణం చేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. సాధారణ రోజుల్లో తాండూరు డిపోలో రూ.14-15లక్షలు, పరిగి



డిపోలో రూ.13-14లక్షలు, వికారాబాద్ డిపోలో రూ.10లక్షల వరకు ప్రయాణికుల నుంచి టికెట్ల ద్వారా వసూలవుతోంది.

**ఐదు రోజుల్లో రెట్టింపు ఆదాయం..**

దసరా పండగ ఈనెల 12వ తేదీన రాగా.. పాఠశాలలకు సెలవులు రావడంతో 10వ తేదీ నుంచే ప్రయాణికుల రద్దీ పెరిగింది. పండగ అనంతరం ఈనెల 14వ తేదీన పెద్దఎత్తున తిరుగు ప్రయాణం చేయడంతో ఈ ఒక్కరోజే మూడు డిపోలు కలిపి మహిళల సున్నా టికెట్ తోపాటు నగదు టికెట్ రూపంలో రూ.60,71,441 రాబట్టాయి.

**డ్రైవర్లు, కండక్టర్ల కృషి ఫలితమే**

దసరా పండగ వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని డ్రైవర్లు, కండక్టర్లు సెలవులు తీసుకోకుండా డ్యూటీలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి సొంత ఊరు, కుటుంబ సభ్యులందరితో కలిసి పండగ చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రయాణికులు తరలి వచ్చారు. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్పించాం. డ్రైవర్, కండక్టర్ల కృషి ఫలితమే ఆర్టీసీకి అదనపు ఆదాయం తెచ్చిపెట్టింది. ఇందుకు వారికి అభినందనలు.సురేష్‌కుమార్, డిపో మేనేజర్, తాండూరు

# విదేశీ కొలువు.. ఇలా సులువు

సిరిసిల్ల: ఉమ్మడి జిల్లాలో స్థానిక ఏజెంట్‌ల చేతిలో మోసపోయి గల్ఫ్ దేశాల్లో చాలా జీవితాలు వెల్లదీస్తున్నారు. అక్కడ సరైనా పని.. తిండి లేక నరకం అనుభవిస్తున్నారు. విదేశాల్లో ఉండలేక.. స్వదేశాలకు రాలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ(టామ్‌కామ్) సువర్ణావకాశాలు కల్పిస్తోంది. జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. యూఏఈలో డెలివరీ బాయ్స్ నియామకాల కోసం ఈ నెల 17న కరీంనగర్‌లోని మున్సిపల్ కార్యాలయం పక్కనున్న ఓ హోటల్‌లో మేళా నిర్వహిస్తోంది. దీనికి 21 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు అర్హులు.

వీరు పదో తరగతి మెమోతో పాటు పాస్‌పోర్టు, మూడేళ్ల క్రితం తీసిన డ్రైవింగ్ లైసెన్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మేళాకు హాజరు కావాలి. నియామక ప్రక్రియ దాదాపు నెల రోజుల్లో పూర్తి చేసి.. కేవలం మెడికల్ పరీక్షలకు డబ్బులు తీసుకొని విదేశాలకు పంపిస్తారు. ఉమ్మడి జిల్లావాసులు ఈ మేళాకు హాజరు కావచ్చు.

భాషపై శిక్షణ విదేశాలకు వెళ్లేవారికి హిందీ, ఆంగ్లంపైనే కాకుండా అక్కడి భాషపై అవగాహన ఉండాలి. ఇందుకు టామ్‌కామ్ ఆధ్వర్యంలో మన ప్రభుత్వమే ఆయా భాషలపై అభ్యర్థులకు ఉచిత శిక్షణిస్తుంది. ఒప్పందం చేసుకొని దేశాల భాషా శిక్షణకు అభ్యర్థులే ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

మెరుగైన వేతనాలు

విదేశాల్లో ఉద్యోగాలకు మెరుగైన వేతనాలు లభిస్తాయి. న్యాక్ సంస్థలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జర్మనీలో నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలున్నాయి. రాష్ట్రం నుంచి అక్టోబరు మొదటి వారంలో 32 మంది జర్మనీకి వెళ్లారు. వీరికి ఏడాది ట్రైనీలుగా నెలకు రూ.1లక్ష వరకు వేతనం ఉంటుంది. పని బాగుంటే అదే కంపెనీలో అవకాశం ఇస్తారు. అప్పుడు నెలకు 2.80 లక్షల జీతం అందిస్తారు.

యాప్‌లో ఉద్యోగాల సమాచారం

టామ్‌కామ్ వెబ్‌సైట్‌తోపాటు యాప్‌లోనూ అన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు, నిరుద్యోగులు విద్యార్హతలు, అనుభవం తదితర వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఏఏ దేశాల్లో ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉన్నాయనే సమాచారం అందులో ఉంటుంది. వెబ్‌సైట్, యాప్‌లోని సమాచారంతో జిల్లాల వారీగా జరిగే జాబ్‌మేళాలకు హాజరు కావచ్చని రాష్ట్ర టామ్‌కామ్ మేనేజర్ షబ్నం 'ఈనాడు'కు తెలిపారు.

సిరిసిల్లకు చెందిన ఇమ్రాన్‌కు ఏజెంటు సూపర్ మార్కెట్‌లో పని ఉందని రూ.1.20 లక్షలు తీసుకుని మూడు నెలల క్రితం కంపెనీ వీసా పేరుతో దుబాయ్ పంపించాడు. తీరా అక్కడికి వెళ్లాక వేరే పనులు చెప్పడంతో ఇమ్రాన్ ఇబ్బందులు పడ్డాడు. స్వదేశానికి పంపాలని యాజమాన్యాన్ని కోరితే చిత్రహింసలకు గురిచేశారు. సామాజిక మాధ్యమాల్లో గోడు వెళ్లబోసుకోవడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడి ఇమ్రాన్‌ను ఇక్కడికి రప్పించారు.

జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన అజయ్ 14 నెలల క్రితం స్థానిక ఏజెంటుకు రూ.2.70 లక్షలు చెల్లించి ఇరాక్ వెళ్లాడు. అక్కడి ఏజెంటు పాస్‌పోర్టు తీసుకొని పని కల్పించలేదు. చేతిలో చిల్లి గవ్వలేక పస్తులుంటున్నానంటూ తల్లిదండ్రులకు అజయ్ బాధపడుతూ వీడియో పంపించాడు. దీంతో వారు స్థానిక ఏజెంట్‌ను నిలదీయగా రూ.1 లక్ష తిరిగి ఇచ్చారు. పాస్‌పోర్టు లేక, వచ్చేందుకు డబ్బుల్లేక అజయ్ అక్కడే అవస్థలు పడుతున్నాడు.

20 దేశాలకు విస్తరణ

టామ్‌కామ్ సంస్థ 2020 వరకు గల్ఫ్ దేశాలకు మాత్రమే నియామకాలు జరిపేది. తర్వాత జపాన్, యూరోపియన్, మిడిల్‌ఈస్ట్, కెనడా, ఆస్ట్రేలియా తదితర 20 దేశాలకు విస్తరించింది. నర్సింగ్, హోటల్, నిర్మాణ, డ్రైవింగ్ తదితర 15 రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఆయా దేశాల ప్రభుత్వాలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం నియామకాలు చేపడుతోంది. జర్మనీలో నర్సింగ్ కోసం ఈ నెల 14న కామారెడ్డి, జగిత్యాల జిల్లాలో అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించింది. 300 మంది హాజరుకాగా అందులో మహిళలు, పురుషులు కలిపి 153 మంది ఎంపికయ్యారు.

# భూమిపూజతోనే సరిపెట్టారు



వేములవాడ: అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వెరసి నిధులున్నా వంతెన నిర్మాణం భూమిపూజకే పరిమితమైంది. వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో కట్టుకాలువ వద్ద ఏటా భారీ వర్షాలకు వరద ప్రవాహం కారణంగా ఈ ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కాలువపై పైవంతెన నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. దాదాపు రూ.2.5 కోట్లు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే సీహెచ్.రమేశ్‌బాబు దాదాపు ఏడాదిన్నర క్రితం భూమిపూజ చేశారు. దీంతో వంతెన నిర్మాణం పూర్తయి తమ కష్టాలు తీరుతాయని ఈ ప్రాంత గ్రామాల ప్రజలు ఆశ పడ్డారు. అయితే పనులు మొదలు కాకపోవడంతో ఈ ప్రాంతీయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది.

**వాగు పారితే రాకపోకలు బంద్**

వేములవాడ పట్టణ శివారు మల్లారం రోడ్డులోని కట్టుకాలువ వర్షాకాలంలో ఉద్ధృతంగా పారితే ఈ ప్రాంతం వైపు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఇదే తంతు జరుగుతున్నా అధికారులు పనులు మొదలు పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భారీ వర్షం కురిస్తే భీమేశ్వరకాలువ నీటితో పాటు వ్యవసాయ క్షేత్రాల నుంచి నీరు భారీగా ఈ కాలువలో చేరుతుంది. దీంతో ఈ కల్వర్టు వద్ద వరద ప్రవాహం వల్ల రవాణా స్తంభించిపోతుంది.

కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు, మరోవైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ మార్గం మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ ప్రాంత గ్రామాల ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతుంది.

వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నాం

కాలువ పారితే మా గ్రామంతో పాటు ఇటు వైపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. దీంతో దాదాపు ఐదారు గ్రామాల ప్రజలు వేములవాడ వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పై వంతెన నిర్మిస్తే ఈ ప్రాంత గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి.

ఎంద్రాల కిరణ్, జయవరం

పనులు మొదలు పెడతాం

గుత్తేదారు కొన్ని కారణాల వల్ల పై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో జాప్యం నెలకొంది. ముందుగా కల్వర్టు వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మించి త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం.

శాంతయ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, వేములవాడ

# వైద్య సేవల పరిమితి పెంపుపై విశ్రాంత కార్మికుల్లో ఉత్కంఠ



గోదావరిఖని : సింగరేణి విశ్రాంత కార్మికులకు రూ.8 లక్షల వరకు వైద్య సేవలు పొందే పరిమితి ఉంది. అయితే దీనిని రూ.10 లక్షలకు పెంచుతామని ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించడంతో పెంపుపై ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఇందులో భాగంగా జేబీసీసీఐ(బొగ్గుగని కార్మికుల సంయుక్త సంప్రదింపుల కమిటీ)తో ఒప్పందం చేసుకున్నారు.

**సవరణకు ఎదురుచూపులు**

ఈనెల 7న సింగరేణి కార్మికులకు లాభాల వాటా పంపిణీ సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వైద్య సేవల పథక పరిమితిని పెంచుతామని ప్రకటించారు. భార్యభర్తకి కలిపి రూ.8 లక్షల వరకు మాత్రమే పరిమితి ఉండటంతో తలో రూ.4 లక్షల వరకు మాత్రమే వైద్య సేవలకు వెచ్చిస్తూ.. ఈ మొత్తాన్ని జీవితకాలం వినియోగించుకోవాలి. అయితే పెద్దజబ్బు వస్తే ఒకేసారికి పూర్తిగా అయిపోయే అవకాశముంది. ప్రకటించిన రూ.10 లక్షల పెంపుపై యాజమాన్యం అమలుకు ఆదేశాలు జారీచేస్తే విశ్రాంత ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది.

**విశ్రాంత అధికారులకు రూ.25 లక్షలు**

సింగరేణి అధికారుల వైద్యసేవల పథకం మరింత మెరుగ్గా ఉంది. వారికి రూ.25 లక్షల వరకు వైద్య సేవలు పొందే అవకాశముంది. అయితే వారికి సంబంధించిన పథకం.. ఉద్యోగులకు సంబంధించిన దానిలో తేడాలున్నాయి. కార్మికులు ఉద్యోగ విరమణ పొందే సమయంలో రూ.40 వేలు వైద్య సేవల పథకం కింద చెల్లిస్తే రూ.8 లక్షల పరిమితి వరకు చికిత్స పొందే వీలుంది. అధికారులకు సంబంధించిన పథకంలో ప్రతినెలా వారి జీతభత్యాల్లోంచి 4 శాతం కోసం కోత విధించి నిధికి జమ చేస్తారు.

**36 వేలమందికి ఉపయోగం..**

ఎక్కువమంది విశ్రాంత కార్మికులు ఉండటంతోపాటు వైద్య సేవల నిధికి తక్కువ మొత్తంలో జమ చేస్తుండటంతో పరిమితి తక్కువగా విధించారు. ప్రస్తుతం సింగరేణిలో 36 వేల మంది విశ్రాంత కార్మికులు సీపీఆర్ఎంఎస్(విశ్రాంత ఉద్యోగుల వైద్య సేవల పథకం)లో సభ్యులుగా ఉన్నారు. వీరికి సంస్థ ఆస్పత్రుల్లో సాధారణ చికిత్సలు ఉచితంగా అందిస్తారు.

**ప్రతినెలా ఉచితంగా మందులు**

సీపీఆర్ఎంఎస్‌లోని విశ్రాంత కార్మికులు ఇన్‌పేషంట్‌గా చేరితే 40 శాతం వైద్య సేవల పథకం నుంచి కోత విధిస్తారు. మిగతా 60 శాతం యాజమాన్యం భరిస్తుంది. ప్రతినెలా అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తారు. అలాగే ప్రాణాంతక వ్యాధులకు సంబంధించిన వైద్యానికి అయ్యే ఖర్చులు అపరిమితం. క్యాన్సర్, హృదయ సంబంధిత, మూత్రపిండాలు, ఎయిడ్స్, రహదారి ప్రమాదం, పక్షవాతం, నరాలకు సంబంధించిన వైద్యం అపరిమితంగా పొందే అవకాశం ఉంటుంది.

# పేరుకే పెద్దాసుపత్రి.. వైద్యులేరీ?

హుజూరాబాద: జాతీయ స్థాయిలో హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి గుర్తింపు పొందింది. నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నారు కానీ.. ఇక్కడ వైద్యుల కొరత ఉండటంతో రోగులు ఇక్కట్లకు గురవుతున్నారు. రోజుకు వందల మంది సేవల కోసం ఆసుపత్రికి వస్తుంటారు. ఉన్న వైద్యులతోనే సేవలను అందిస్తున్నారు.

అరకొర సిబ్బంది.. తప్పని ఇబ్బంది హుజూరాబాద్‌లోని వంద పడకలు గల ఏరియా ఆసుపత్రిలో మొత్తం 14 మంది రెగ్యులర్ వైద్యులున్నారు. మరో 9 మంది వైద్యులు డిప్యుటేషన్‌పై వచ్చారు. మొత్తం 23 మంది వైద్యులు సేవలను అందిస్తున్నారు.

జ్వరాలు, రోడ్డు ప్రమాదాలు, కుక్కకాటు, పాముకాటు, పాయిజన్, చర్మ, కంటి, దంత, చెవి, ముక్కు, గొంతు, సాధారణ వైద్య సేవల కోసం రోజూ సుమారు 400 నుంచి 470 మంది వరకు వస్తున్నారు. మరో 100 మంది వరకు గర్భిణులు వైద్యం పొందుతున్నారు. అందులో 30 మందికి సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి.

ప్రస్తుతం 20 నుంచి 30 వరకు సాధారణ, ఎముకల శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఆసుపత్రిలో సూపరింటెండెంట్, ఆర్ఎంవో, ఏవోతోపాటు ఆరుగురు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, నలుగురు ప్రత్యేక వైద్య నిపుణులు, ముగ్గురు పిల్లల వైద్య నిపుణులు, అయిదుగురు స్త్రీ వైద్య నిపుణులు, ఇద్దరు మత్తుమందు వైద్యులు సేవలను అందించేవారు. ఇటీవల ఇద్దరు ఎముకల వైద్య నిపుణులు, చెవి ముక్కు గొంతుతోపాటు మరో ముగ్గురు స్త్రీ, మత్తుమందు వైద్య నిపుణులను బదిలీ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఎముకల వైద్య విభాగంలో ఓ వైద్యుడిని డిప్యుటేషన్ వేయగా, ఈఎన్‌టీ వైద్యుడిని ఇంతవరకు నియమించలేదు.

హుజూరాబాద్ ఆసుపత్రి జనరల్ సర్జన్‌కు ఇటీవల జమ్మికుంట ఆసుపత్రికి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. మరోవైపు హుజూరాబాద్‌లో ఒక్కరే మత్తుమందు వైద్యుడు ఉండగా.. ఆయన ఒక్కరే హుజూరాబాద్, జమ్మికుంట ఆసుపత్రుల్లో



విధులను నిర్వహించాల్సి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్త్రీ వైద్య నిపుణురాలితోపాటు ఇద్దరు మత్తుమందు వైద్యుల అవసరం ఉంది. మరో పది మంది స్టాఫ్ నర్సులు కావాల్సి ఉంది. సమస్యపై హుజూరాబాద్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎ.రాజేందర్‌రెడ్డిని సంప్రదించగా.. వైద్యులు, సిబ్బంది కొరత ఉందని తెలిపారు. పూర్తిస్థాయి సిబ్బంది ఉంటే 24 గంటలపాటూ మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

జమ్మికుంటలోనూ.. జమ్మికుంట ఆసుపత్రికి రోజూ 100 నుంచి 170 రోగులు సేవల కోసం వస్తుంటారు కానీ.. ఇక్కడ ఓపీ సేవలే అందుబాటులో ఉన్నాయి. ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌తోపాటు మరో ఆరుగురు వైద్యులు సేవలను అందిస్తున్నారు. అన్ని వార్డులు, ఆపరేషన్ విభాగాలున్నప్పటికి వైద్యులు మాత్రం లేరు. ఎముకలు, దంత వైద్యులు మాత్రమే ఉండగా, కేవలం ఓపీ సేవలు అందిస్తున్నారు. వారానికి రెండు రోజుల మాత్రమే స్త్రీ వైద్య నిపుణురాలు ఇక్కడికి వచ్చి సేవలను అందిస్తున్నారు. దంత వైద్యుడున్నప్పటికి అన్ని పరికరాలు లేకపోవటంతో కేవలం ఓపీ వరకే చూస్తున్నారు. ఫార్మాసిస్టు డిప్యుటేషన్ వస్తుండగా, ల్యాబ్‌లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. కనీసం ఎక్స్‌రే వసతి కూడా అందుబాటులో లేదు. 24 గంటలపాటు అందుబాటులో ఉండే స్త్రీ వైద్య నిపుణురాలు, ఇద్దరు మత్తు మందు, పిల్లల వైద్యులు కావాలి.

# కల్తీ కబళిస్తోంది

కరీంనగర్ : ఆహార పదార్థాలు పండిన చోటు నుంచి లేదా తయారైన చోటు నుంచి వినియోగదారులకు చేరే క్రమంలో కొందరు స్వార్థపరుల వల్ల కల్తీకి గురవుతున్నాయి. పదార్థాలు ఆకర్షణీయంగా ఉండాలనో.. ఎక్కువకాలం నిలువుండాలనో.. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనో ఇలా రకరకాల ప్రయోజనాలు ఆశించి అవసరం లేని రసాయనాలు వాడి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. అందుకే శరీరంలో ఏదో తెలియని నిస్సత్తువ. కొందరికి తింటే అరగటం లేదు. శుభ్రమైన నీరు.. నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహారం భద్రతపై ప్రత్యేక కథనం.

**డబ్బులిచ్చీ జబ్బు పడాలా?**

ఉదయం లేచినప్పటి నుంచి డబ్బిచ్చి సేవలు పొందుతున్నాం. ప్రతి సందర్భంలోనూ వినియోగదారులమే. మనకు కావాల్సిన వస్తువులు అమ్మేది, సేవల్ని అందించేది ప్రైవేటు వ్యక్తులు.. సంస్థలు.. ప్రభుత్వమైనా కావచ్చు.. చెల్లించిన సొమ్ముకు తగిన ప్రతిఫలం ఆశించడం వినియోగదారుల హక్కు. డబ్బిచ్చి అనారోగ్యం పాలవడం ఎంతవరకు సమంజసం. అవసరమైనప్పుడు హక్కు వినియోగించుకునే చైతన్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని పౌరసమాజం కోరుకుంటోంది.

**కనిపెట్టడం ఇలా..**

చిన్న సీసాలో కొద్దిగా పాలు తీసుకొని గిలకొట్టాలి. డిటర్జెంట్ లాంటివి కలిపితే నురగ ఎక్కువగా వస్తుంది.

తెల్లని బ్లాటింగ్ పేపర్‌ని తడిపి కానీ తడి దూదితో కానీ కూరగాయలు, పండ్లు తుడిస్తే కృత్రిమ రంగు ఉంటే తెలిసిపోతుంది.

ఐస్ క్రీం కొంచెం విడిగా తీసి దానిమీద రెండు చుక్కల నిమ్మరసం పిండాలి. నురగలు వస్తే కల్తీ జరిగినట్లే.

మిరియాలను ఆల్కహాలులో వేస్తే మునిగిపోతాయి. బొప్పాయి గింజలు కలిస్తే తేలుతాయి. పంచదార, ఉప్పుల్లో కల్తీ జరిగినట్లు అనుమానమొస్తే చెంచాడు తీసుకొని నీళ్లలో వేస్తే అవి కరిగిపోతాయి. కల్తీ ఉంటే చాక్‌పొడి అడుగున పేరుకుంటుంది.

కాస్త తేనెలో దూదిని ముంచి తీసి వెలిగిస్తే మండుతుంది. కల్తీ అయితే చిటపటలాడుతుంది.

కరిగిన నెయ్యిలో ఒక స్పూన్ చక్కెర వేసి బాగా కలపాలి. ఐదు నిముషాల తర్వాత అది ఎరుపు రంగులోకి మారితే కల్తీ జరిగినట్లు.

పసుపు కానీ పప్పు కానీ.. కొద్దిగా నీళ్లలో వేసి దాంట్లో కొన్ని చుక్కలు హైడ్రోక్లోరిక్ ఆసిడ్ వేయాలి. మెటానిల్ ఎల్లో కల్తీ జరిగితే నీరు ఊదారంగులోకి మారుతుంది. పసుపులో లెడ్ క్రోమైట్ కలిసినట్లయితే నీళ్లు మరీ ఎక్కువ పచ్చగా మారుతాయి. మంచి పసుపు నీళ్లలో కరగకుండా అడుగున చేరుకుంటుంది.

ఎలా చేస్తారంటే.. పాలు, పాల ఉత్పత్తులు: తరచుగా కల్తీకి గురయ్యేవి నిత్యం వాడే పాలు. అందులో ఏ నీళ్లు పడితే ఆ నీళ్లు కలిపితే అనారోగ్యం తప్పదు. పాల రంగూ, చిక్కదనం కోసం చాక్ పౌడర్, యూరియా, కాస్టిక్ సోడా, హైడ్రోజన్ పెరాక్సైడ్ లాంటివి కలుపడం వల్ల జీర్ణ సంబంధ సమస్యలు, పిల్లల్లో హార్మోన్ల సమస్యలు వస్తాయి.

పప్పులు: ఆకర్షణీయంగా కన్పించేందుకు మెటానిల్ ఎల్లో కలర్ కలుపుతారు. ఇది కలిపిన ఆహారపదార్థాలు తింటే న్యూరోటాక్సిసిటీ అనే సమస్యతో నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది.

మసాల దినుసులు: మిరియాల్లో బొప్పాయి గింజలు, పసుపులో మెటానిల్ ఎల్లో, రెడ్ ఆక్సైడ్, ఇంగువలో మట్టి, కారంలో ఇటుక పొడి కలుపుతారు. ఖరీదైన కుంకుమ పువ్వులో మొక్కజొన్న పీచును కలుపుతారు. కూరగాయలు, పండ్లు: కాపు ఎక్కువగా వచ్చేందుకు, పురుగు పట్టకుండా ఉండేందుకు ఎన్నో రసాయన మందులు వినియోగిస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించడానికి రసాయన రంగుల్ని ఇంజెక్ట్ చేస్తారు. ఆకుపచ్చని కూరలు మరింత పచ్చగా తాజాగా కనిపించేందుకు మాలకైట్ గ్రీన్ అనే రసాయన రంగు క్యాన్సర్ కారకం కూడా. ఇంకా ఆక్సిటోసిన్, శాకరిన్, వ్యాక్స్, కాపర్ సల్ఫేట్ వంటివి వాడుతున్నారు.

**ఇదీ నేపథ్యం..**

1945లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ స్థాపనకు గుర్తింపుగా ఏటా అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'మంచి భవిష్యత్తు కోసం ఆహారం అందించడమే లక్ష్యం' అనే థీమ్‌ను ఈ ఏడాది తీసుకున్నారు.

వృథా వద్దు..

జనాభాకు అనుగుణంగా అవసరమైన ధాన్యంతోపాటు ఇతరత్రా ఆహార పదార్థాలు సరిపోవడం లేదు. శుభకార్యాల సందర్భంగా మిగిలిన ఆహారం వృథాగా పాడేస్తున్నారు. అవే పదార్థాలను అనాథలకు, పేదలకు అందాలనే సంకల్పంతో కొందరు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం 9949 914242కు ఫోన్ చేస్తే వారే వ్యాన్ లేదా ఆటోలో వచ్చి ఆహారం తీసుకొని వెళ్తారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ దంపతులు ఆరేళ్లుగా శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని స్లమ్ ఏరియాలోని కుటుంబాలకు అందిస్తున్నారు. 93945 05101కు ఫోన్ చేస్తే వారే అద్దె ఆటోలో తీసుకెళ్లి పేదలకు అందిస్తున్నారు.

రంగులు కలిపితే సమస్యలు తప్పవు

సాయి ప్రియ, న్యూట్రీషియనిస్ట్, కరీంనగర్

ఆహార పదార్థాల్లో రసాయన రంగులు కలపడం వల్ల క్యాన్సర్, రక్తహీనత సమస్యలు తలెత్తుతాయి. జంక్ ఫుడ్, మంచూరియా, చిల్లీ పౌడర్, ఆయిల్స్, రెడీ ఈట్ ఫుడ్‌లో ఇవి ఎక్కువగా కలిసే అవకాశం. ప్యాకెట్ ఫుడ్‌లో ఏయే పదార్థాలు కలిపారో చూసుకొని తినాలి. ఎక్కువగా కొబ్బరి, ఇతరాత్ర చెట్ల పాలు తాగడం మంచిది. సహజంగా దొరికే ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి.

# కాలుష్య తనిఖీలకు ఆమడ దూరం

హైదరాబాద్ : కాలుష్య తనిఖీలకు గ్రేటర్‌లోని వాహనదారులు ఆమడ దూరం ఉంటున్నారు. ఉచిత డ్రైవ్ నిర్వహించినా స్పందించడం లేదు. ఇటీవల కాలుష్య నియంత్రణ మండలి గ్రేటర్‌లోని ఆరు ప్రాంతాల్లో ఉచిత పీయూసీ (పొల్యూషన్ అండర్ కంట్రోల్ డ్రైవ్) నిర్వహించింది. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రొగ్రామ్‌లో భాగంగా సెప్టెంబర్ 7న ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తే కేవలం 390మంది వాహనదారులు మాత్రమే తనిఖీలు చేయించుకున్నారు. గ్రేటర్‌లో 80లక్షలకు పైగా వాహనాలుంటే పాల్గొంది 0.005శాతం మాత్రమే. దీన్నిబట్టి పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఉచిత డ్రైవ్ నిర్వహించిన ప్రాంతాలివే..: కాలుష్య ఉద్గారాలతో ఇంధన సామర్థ్యం, ఆరోగ్యంపై ప్రభావంతోపాటు నేషనల్ క్లీన్‌ఎయిర్ ప్రొగ్రామ్‌పై అవగాహన కల్పించేందుకు పీసీబీ ఈ ఉచిత డ్రైవ్‌ను చేపట్టింది. ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ భగాయత్, నాంపల్లి పోలీస్ కంట్రోల్ రూమ్, ప్రసాద్ ఐమాక్స్, దుర్గం చెరువు సమీపంలో, మియాపూర్ మెట్రోస్టేషన్ ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమానికి సగటున 80మంది కూడా రాలేదు. పీయూసీ సర్టిఫికేట్, తనిఖీలు చేయించుకున్నారనే అంశంలో నిఘా లేకపోవడంతో డొక్కు వాహనాలు రోడ్డెక్కి కాలుష్యాన్ని పెంచేస్తున్నాయి. నగరంలో 70శాతం వాహనదారులు పీయూసీ తనిఖీలకు ఆసక్తి చూపడం లేదని, కాలుష్య ఉద్గారాల నమోదును దాచిపెడితే రూ.2వేల నుంచి రూ.5వేల వరకు జరిమానా పడొచ్చని హెచ్చరిస్తున్నారు.




అమరావతి: గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైకాపా సర్వనాశనం చేసిందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు విమర్శించారు. ఆ పార్టీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. తనను జైల్లో పెడితే పవన్‌కల్యాణ్ వచ్చి పరామర్శించి.. తెదేపాతో కలిసి పోటీ చేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు. మోదీ నుంచి అందరూ నేర్చుకోవాలని.. పట్టుదల, కృషి వల్లే ఆయన మూడోసారి ప్రధాని అయ్యారని కొనియాడారు. వైకాపా చేయని తప్పులు లేవని.. అందుకే ప్రజలు చిత్తుగా ఓడించారని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కూటమికి 93 శాతం స్ట్రయిక్‌రేట్ ఇచ్చారన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వ హించిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.


**అండగా ఉన్న వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం...** "దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ తెదేపా. భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది సమీక్షించాలి.

కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నాం. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఎన్నికల సీట్ల కేటాయింపులో తెదేపాకు అండగా ఉన్నవర్గాలకు ప్రాధాన్యం కల్పించాం. ఇంతవరకు ప్రాతినిధ్యం దక్కని వారికి అవకాశం కల్పించాం. 'ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాం.

**రాజకీయ పార్టీ.. కుటుంబం లాంటిదే...** గెలిచాం మన పని అయిపోయిందని అనుకుంటే చాలా సమస్యలు వస్తాయి. ఎన్నికల సమయంలో ఉన్న పరిస్థితుల వల్ల పార్టీని నమ్ముకున్న కొంతమందికి సీట్లు ఇవ్వలేకపోయాం. న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చాం. ప్రజలు మనల్ని విశ్వసించారు.. దాని ప్రకారం ముందుకెళ్లాలి. ఇప్పుడు అందరిపై బాధ్యత ఉంది. కొత్త ఎమ్మెల్యేలు 65 మంది ఉన్నారు. 18 మంది కొత్త మంత్రులు ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల్లో దాదాపు 80 మంది వరకు కొత్తవారే. కుటుంబంలోనే భేదాభిప్రాయాలు ఉంటాయి. ఫ్యామిలీని ఐక్యంగా ఉంచేందుకు ఇంటిపెద్ద ఆలోచిస్తుంటారు. రాజకీయ పార్టీ కూడా అంతే. నాపై ఆ బాధ్యత ఉంది.

**ప్రధాని మోదీ నుంచి నేర్చుకోవాలి :** చండీగఢ్‌లో హరియాణా సీఎం ప్రమాణస్వీకారం తర్వాత ఎన్డీయే సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ 5 గంటల పాటు అక్కడ కూర్చున్నారు. మోదీ అంతసేపు ఉండాల్సిన అవసరం లేదు. కానీ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. మోదీ నుంచి నేర్చుకోవాలి. ఆయన పట్టుదల, కృషి వల్లే మూడోసారి ప్రధాని అయ్యారు. ఆరుసార్లు గుజరాత్‌లో భాజపా గెలిచింది. మూడోసారి హరియాణాలో విజయం సాధించారు. సమష్టిగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారు. ఏం చేసినా ప్రజలను దృష్టిలో ఉంచుకుని చేశారు. దేశంలో ఎవరికీ దక్కని విజయం మోదీకి దక్కిందంటే దాని వెనుక కఠోరమైన శ్రమ, క్రమశిక్షణ ఉన్నాయి. ఎక్కడా తప్పు చేయకుండా పార్టీని ఆయన కాపాడుకుంటూ వస్తున్నారు"అని చంద్రబాబు కొనియాడారు.

# భారీ వర్షాలు.. ప్రాజెక్టులకు జలకళ




కర్నూలు, అక్టోబర్ 18: రాష్ట్రంలో మరోసారి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. విశాఖపట్నం, కాకినాడలో ఎడతెరపిలేకుండా వర్షాలు పడుతున్నాయి. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. విశాఖ ఆర్కేబీచ్, కాకినాడ తీరాల్లో పెద్ద ఎత్తున అలలు ఎగిసిపడటంతో ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాకినాడ ఉప్పాడ వద్ద సముద్రం అల్లకల్లోలంగా మారిపోయింది. ఈరోజు (శుక్రవారం) కూడా కాకినాడ నగరంలో కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల నుంచి ఏకధాటిగా వాన కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులకు బ్రేక్ పడింది. బార్జీల నుంచి నౌకలకు బియ్యం రవాణా నిలిపివేశారు అధికారులు.

**ఉప్పొంగిన గుండ్లకమ్మ వాగు...** అటు ప్రకాశం జిల్లా మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు మండలాల్లో వేకువజాము నుంచి భారీ వర్షం కురుస్తోంది. మార్కాపురం మండలం బొడిచర్ల వద్ద గుండ్లకమ్మ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. తర్లుపాడు – మార్కాపురం మధ్య కొండ వాగు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**తుంగభద్ర 10 గేట్లు ఎత్తివేత :** మరోవైపు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. తుంగభద్ర జలాశయం, శ్రీశైలం జలాశయానికి భారీగా ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు విడదల చేస్తున్నారు. తుంగభద్ర జలాశయం నుంచి 10 గేట్ల ద్వారా నీటిని అధికారులు విడుదల చేశారు. పూర్తి స్థాయి నీటి మట్టం1633 అడుగులు కాగా.. ప్రస్తుతం నీటి మట్టం 1631.93 అడుగులకు చేరింది. అలాగే ఇన్ ఫ్లో 50,593 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 36,799 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 101.500 టీఎంసీలుగా నమోదు అయ్యింది..

**శ్రీశైలం జలాశయంలో..** ఇటు నంద్యాలలోని శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతోంది. ఇన్ ఫ్లో 79,536 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో : 67,626 క్యూసెక్కులుగా నమోదు అయ్యింది.

పూర్తి స్థాయి నీ టి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.50 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటి నిల్వ 215.8070 టీఎంసీలకు గాను.. ప్రస్తుతం 212.9198 టీఎంసీలుగా కొనసాగుతోంది. మరోవైపు కుడి గట్టు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

# రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చూడాలన్నది జగన్ కుట్ర: హోంమంత్రి అనిత



అమరావతి: జగన్ కుట్రలన్నీ సమర్థంగా తిప్పికొడుతున్నామని హోంమంత్రి అనిత తెలిపారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రోజుకో అబద్ధం చెప్పి పెట్టుబడులు రాకుండా చూడాలన్నది జగన్ కుట్ర అని విమర్శించారు. ఆ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

**ఎవరు తప్పు చేసినా చంద్రబాబు సహించరు: మండిపల్లి రామ్‌ప్రసాద్...** క్రమశిక్షణకు సీఎం చంద్రబాబు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ అన్నారు. ఎవరు తప్పు చేసినా ఆయన సహించరన్నారు. ప్రజలకు సుపరిపాలనే లక్ష్యంగా పార్టీ సమావేశం జరుగుతోందని చెప్పారు.

**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిదే విజయం: నిమ్మల...** రైతు సంఘాలు, నీటి సంఘాలను వైకాపా నిర్వీర్యం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. రైతు ప్రాతినిధ్యంతోనే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశ విదేశాల్లోని తెలుగువారంతా పార్టీ సభ్యత్వంపై ఆసక్తి చూపిస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. శాశ్వత సభ్యత్వానికి చాలా మంది ముందుకొస్తున్నారని చెప్పారు.

# దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి: సోమిరెడ్డి



నెల్లూరు: వైకాపా నేతల మాదిరిగా సహజ వనరులను ఎవరూ దోచుకోరని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఎవరూ దోపిడీ చేయకూడదన్నదే సీఎం చంద్రబాబు ఉద్దేశమన్నారు. ఆయన ఓర్పును మాటల్లో చెప్పలేమని తెలిపారు.

దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు.

# సజ్జలవి పగటి కలలు: తెదేపా ఎంపీ కేశినేని చిన్ని



అమరావతి: అధికారంలో ఉన్నప్పుడు వైకాపా నేతలు తప్పుల మీద తప్పులు చేశారని తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఇప్పుడు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు. తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేల సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. మళ్లీ అధికారంలోకి వచ్చి అక్రమ కేసులు పెట్టాలని వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి పగటి కలలుకంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రజా జీవితంలో వైకాపా ఇక కనపడదని.. ఈ విషయాన్ని ఆయన గుర్తించాలన్నారు.




# 'ప్రాణాలతో ఉండాలంటే రూ.5కోట్లు ఇవ్వు': సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపులు

ముంబయి: బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు ఈ మెసేజ్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఈ మెసేజ్ వచ్చింది. "ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ (ఇటీవల హత్యకు గురైన) కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని దుండగులు అందులో బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, మెసేజ్ ఎక్కడినుంచి వచ్చిందన్న దానిపై విచారణ జరుపుతున్నామని ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈనేపథ్యంలో బాంద్రాలోని ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. సల్మాన్‌ఖాన్‌కు ఇలా బెదిరింపులు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలుమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే.


ఇక, అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. నటుడి ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచింది. ఇదిలాఉండగా.. సల్మాన్ ఖాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ గతవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. ముగ్గురు దుండగులు సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య తామే చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.

# సిద్ధరామయ్యపై ఆరోపణల వేళ.. ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు




బెంగళూరు: కర్ణాటకలో మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణం కలకలం సృష్టిస్తోంది. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ కొనసాగుతున్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముడా కార్యాలయంలో సోదాలు నిర్వహించింది. కమిషనర్ రఘునందన్, ఇతర అధికారులతో ఈడీ అధికారులు మాట్లాడారు. ఈ అవినీతి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిని విచారించనున్నారు. అలాగే పలు దస్త్రాలను స్వాధీనం చేసుకొనే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి. ఇదిలాఉంటే.. రెండురోజుల క్రితం ముడా అథారిటీ ఛైర్మన్ కె.మరిగౌడ రాజీనామా చేశారు. మరిగౌడ సీఎం సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడని పేరుంది. అయితే.. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. గత నెలలో ఆయన కారులో బెంగళూరుకు వెళ్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈక్రమంలో అనారోగ్యం కారణంగానే ఆయన రాజీనామా చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ముడా స్కామ్ వ్యవహారంలో సిద్ధరామయ్యతో పాటు మరిగౌడ ప్రమేయం కూడా ఉన్నట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా.. ముడా స్కామ్ వ్యవహారం సీఎం సిద్ధరామయ్యను ముప్పతిప్పలు పెడుతోంది. ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. ఈక్రమంలోనే ఆయన సతీమణి తమ భూములను తిరిగి ముడా సంస్థకు ఇచ్చేశారు. ఈ వ్యవహారంలో తనను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరుచేయడాన్ని సీఎం హైకోర్టులో సవాల్ చేసినా ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. ఒకవైపు సిద్ధరామయ్యపై విచారణ కొనసాగుతుండగా.. తాజాగా ముడా చీఫ్ రాజీనామా కన్నడనాట తీవ్ర చర్చకు దారితీసింది.

# ఎమ్మెల్యేగా ఉన్న జగన్.. కోర్టుకు వచ్చేందుకు అభ్యంతరమేంటి?: న్యాయవాది సలీం



విశాఖపట్నం: కోడికత్తి కేసు విచారణకు నిందితుడు జనుపల్లి శ్రీనివాస్ హాజరయ్యాడు. న్యాయవాది సలీం, దళిత సంఘాల నేత బూసి వెంకటరావుతో కలిసి విశాఖలోని ఎన్ఐఏ కోర్టుకు వచ్చాడు. ఈ సందర్భంగా సలీం, బూసి వెంకటరావు మీడియాతో మాట్లాడుతూ వైకాపా అధ్యక్షుడు జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా ఉన్న నారా లోకేశ్ పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరయ్యారని.. సాధారణ ఎమ్మెల్యేగా ఉన్న జగన్ ఎందుకు రావడం లేదని సలీం ప్రశ్నించారు. బూసి వెంకటరావు మాట్లాడుతూ జైల్లో ఉన్న వ్యక్తులను కలిసేందుకు వెళ్లినపుడు లేని అభ్యంతరం.. కోర్టులో న్యాయమూర్తి ముందు సాక్షిగా హాజరై వాంగ్మూలం ఇచ్చేందుకు జగన్‌కు అభ్యంతరమేంటని నిలదీశారు.

# ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు.. కూటమి సర్కార్‌కు షర్మిల సూటి ప్రశ్న



విజయవాడ, అక్టోబర్ 18: ఉచిత బస్సు ప్రయాణంపై కూటమి ప్రభుత్వాన్ని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి పలు ప్రశ్నలు సంధించారు. శుక్రవారం విజయవాడ బస్టాండ్ నుంచి తెనాలికి వెళ్ళే పల్లెవెలుగు బస్సులో షర్మిల ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో టిక్కెట్ కొని.. ఉచితం ఎప్పుడిస్తారు అంటూ సర్కార్‌కు సూటి ప్రశ్న వేశారు. ఉచిత ప్రయాణం అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు పీసీసీ చీఫ్ పోస్ట్ కార్డు రాశారు.

**ఆర్టీసీకి డబ్బులు చెల్లించాల్సి వస్తుందనా...** ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... చంద్రబాబు అధికారంలో వచ్చి నాలుగు నెలలు అయిందని.. అయినా ఉచిత బస్సు ప్రయాణంపై ఇంత వరకు నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఉచిత ప్రయాణం ఎప్పుడు అని అడుగుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వారంలో అమలు చేశారని... ఏపీలో పథకం అమలు చేయడానికి ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. ఆర్టీసీకి డబ్బులు ఇవ్వాల్సి వస్తుందనా అని అన్నారు. రాష్ట్రంలో ప్రతిరోజూ 20 లక్షల మంది మహిళలు ప్రయాణం చేస్తున్నారని.. రోజు మహిళల ద్వారా రూ.7 కోట్ల ఆదాయం... నెలకు రూ.300 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ఉచిత ప్రయాణం కల్పిస్తే... ఈ రూ.300 కోట్లు ఆర్టీసీకి ఇవ్వాల్సి వస్తుందని భయమా అని నిలదీశారు.

**ఇది చాలా మంచి పథకం :** "మహిళల ఓట్లు తీసుకున్నారు. హామీ ఇచ్చారు. ఇప్పుడు మహిళల కోసం రూ.300 కోట్లు ఖర్చు చేయలేరా ?. మీ సూపర్ సిక్స్ హామీల్లో 4 పథకాలు మహిళలవే. ఇందులో ఉచిత ప్రయాణం ఒక్కటే తక్కువ ఖర్చు. ఇలాంటి తక్కువ ఖర్చు పథకం మీకు అమలు చేయడానికి ధైర్యం రావడం లేదు. మీకు ఇష్టం వచ్చినప్పుడు అమలు చేస్తారా. ఇదే అమలు చేయనప్పుడు ఇక పెద్ద పథకాల సంగతి ఏంటి. 5 ఏళ్లు ఇలానే కాలయాపన చేస్తారా. ఎప్పుడు అమలు చేస్తారు అని ప్రజలు అడుగుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు భద్రత ఉంటుంది. ఎంతో మంది మహిళలు బస్సులను ఆశ్రయిస్తారు. ఇది చాలా మంచి పథకం. సీఎం చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాం. వెంటనే ఉచిత ప్రయాణం అమలు చేయండి. అదే విధంగా మహిళల కోసం పెట్టిన పథకాలు వెంటనే అమలు చేయండి. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వండి. ఇప్పటికే మార్కెట్‌లో అన్ని ధరలు పెరిగాయి. మహిళల మీద భారం పడుతోంది. మహిళలకు భరోసా కావాలి. మహిళలకు భద్రత విషయంలో ముందడుగు పడాలి" అని చెప్పుకొచ్చారు.

**ఇది చూసైనా..** " రాష్ట్రంలో నెల రోజుల్లో హత్యాచారాల మీద రిపోర్ట్ తీశాం. అన్ని పెపర్ల నుంచి ఆర్టికల్స్ సేకరించాం. 99 కే మద్యం ఇస్తే.. మహిళల మీద హత్యాచారాలు పెరుగుతాయి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించాలని ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు పంపిస్తున్నాం. రాబోయే రెండు మూడు రోజుల్లో పెద్ద ఎత్తన పోస్ట్ కార్డులు పంపిస్తాం. ఇది చూసైనా వెంటనే చంద్రబాబు మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలి" అని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# వెనకుండి నడిపిందే సజ్జల.. ఇప్పుడు నీతులు చెబితే ఎలా?: భాజపా నేత భానుప్రకాశ్ రెడ్డి



విజయవాడ: అవినీతి, అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ వైకాపా అని భాజపా నేత భానుప్రకాశ్ రెడ్డి విమర్శించారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వమని చెప్పారు. విజయవాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో కొత్త నాటకానికి జగన్ తెరలేపారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు నియంతలా వ్యవహరించారని.. ఇప్పుడు మీడియా ముందుకొచ్చి అవినీతి పాలన అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "సజ్జల ఇప్పుడొచ్చి నీతులు చెబుతుంటే జనం నమ్మరు. 420 టీమ్‌ను వెనకుండి నడిపిందే ఆయన. వైకాపా కార్యకర్తలను రెచ్చగొట్టి.. తెదేపా కార్యాలయంపై దాడి చేయించింది సజ్జల కాదా? బోరుగడ్డ అనిల్ వ్యాఖ్యలను ఎందుకు ఖండించలేదు? ఇప్పుడు అతడిని అరెస్టు చేస్తుంటే గగ్గోలు పెడతారా? ప్రజల మధ్య జగన్ విద్వేషాలు రెచ్చగొడితే ఊరుకోం" అని భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు.

# వింటర్ స్టైల్‌లో అదరగొట్టిన నేషనల్ క్రష్!


స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న సోషల్ మీడియాలో తన గ్లామర్ తో ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ గా నిలుస్తూ ఉంటుంది. రీసెంట్ గా ఆమె చేసిన ఫోటోషూట్ మరోసారి అందర్నీ ఆకట్టుకుంది. రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో Onitsuka Tiger Autumn Winter 2024 కలెక్షన్‌ను ప్రదర్శిస్తూ కొన్ని అద్భుతమైన ఫోటోలను పోస్ట్ చేసింది. ఈ ఫోటోలలో రష్మిక నగర వాతావరణంలో వింటర్ వేర్‌ను సరిగ్గా ప్రదర్శిస్తూ స్టన్నింగ్ లుక్స్ లో కనిపిస్తోంది. ఫోటోషూట్‌లో భాగంగా, రష్మిక టాప్ నాట్ లో జుట్టు సర్దుకుని, చలికాలం ఫ్యాషన్ అవుట్‌ఫిట్స్‌లో దర్శనమిచ్చింది. ఒక ఫోటోలో బ్లాక్ జాకెట్ ధరించి, ఆకర్షణీయమైన పోజ్ లో నిలబడిన రష్మిక ఆ లుక్‌కి మరో సొగసును తీసుకొచ్చింది. మరో ఫోటోలో ఆమె పర్ఫెక్ట్ టోన్ మేకప్‌తో సహజత్వం కనబరిచింది. రష్మిక తన ఫ్యాషన్ సెన్స్‌తో మామూలుగా ఉండదు



అని మరోసారి ప్రూవ్ చేసింది. రష్మిక సినిమాల విషయానికొస్తే, ప్రస్తుతం ఆమె చేతి నిండా పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్ సరసన 'చావా' సినిమాలో నటిస్తోంది. అదే విధంగా, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కుబేర' అనే సినిమాతో బిజీగా ఉంది. వీటితో పాటు 'గర్ల్‌ఫ్రెండ్' మూవీలో దీక్షిత్ శెట్టితో స్క్రీన్ షేర్ చేసుకుంటోంది. ఇవి కాకుండా, టాలీవుడ్‌లో అద్భుతమైన విజయం సాధించిన 'పుష్ప' సీక్వెల్ 'పుష్ప 2' లో శ్రీవల్లిగా రష్మిక మరోసారి అలరించనుంది. రష్మిక కెరీర్‌లో మొదటగా కన్నడ సినిమాలతో నటన మొదలుపెట్టినా, తెలుగులో ఆమెకు వచ్చిన గుర్తింపు అంతా ఇంతా కాదు. 'గీత గోవిందం,' 'సరిలేరు నీకెవ్వరు' వంటి సినిమాలతో ఆమె టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మారింది. ఇప్పుడు నార్త్ ఇండియా వరకు తన సత్తా చాటుకుంటూ పాన్ ఇండియా స్టార్‌గా ఎదుగుతోంది. రష్మిక అందం, అభినయం మాత్రమే కాదు, ఆమె ఫ్యాషన్ సెన్స్ కూడా ప్రతిసారీ హైలైట్ అవుతూ ఉంటుంది.

# చిన్న హీరోతో సమంత ప్రయోగమే..

టాలీవుడ్‌లో స్టార్‌డమ్‌ను అందుకుని నేషనల్ వైడ్‌గా ఫాలోయింగ్‌తో పాటు మార్కెట్ పరంగా ఎఫెక్ట్‌ను చూపించిన హీరోయిన్లు చాలా తక్కువ మందే ఉన్నారు. అలాంటి వారిలో టాలెంటెడ్ లేడీ సమంత రూత్ ప్రభు ఒకరు. చూపు తిప్పుకోకుండా చేసే అందంతో పాటు మైమరపించే నటనతో మెప్పించిన ఈ భామ.. స్టార్‌గా మారిన తర్వాత మరింతగా దూసుకెళ్లింది. సమంత రూత్ ప్రభు చాలా కాలం పాటు ఏకధాటిగా సినిమాలు చేస్తూ వచ్చింది. అయితే, ఈ మధ్య కాలంలో మాత్రం ఆమె సెలెక్టెడ్‌గానే స్క్రిప్టులను ఎంపిక చేసుకుంటోంది. మరీ ముఖ్యంగా ఈ బడా హీరోయిన్ లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో నటిస్తోంది. చివరిగా సమంత 'ఖుషి' వచ్చి మెప్పించింది. ఈ చిత్రం ఆశించిన రీతిలో విజయాన్ని అందుకోకపోవడంతో ఆమెకు నిరాశే ఎదురైంది. ప్రస్తుతం సమంత రూత్ ప్రభు మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతోన్న సంగతి తెలిసిందే. ఈ కారణంగానే సినిమాలు కూడా నెమ్మదిగా చేస్తోంది. ఇప్పుడు ఆమె నటించిన 'సీటాడెల్: హనీ బన్నీ' మాత్రం స్ట్రీమింగ్‌కు సిద్ధం అవుతోంది. ఇటీవలే సమంత రూత్ ప్రభు 'ట్రలాల



మూవింగ్ పిక్చర్స్' అనే ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించింది. తద్వారా నిర్మాతగా బిజీ అయ్యేందుకు రెడీ అవుతున్నట్లు తెలిపింది. 'ఖుషి' తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న సమంత రూత్ ప్రభు తన సొంత బ్యానర్‌లోనే 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించింది. ఇందులో ఆమె లీడ్ రోల్ కూడా చేయబోతున్నట్లు వెల్లడించింది. దీనితో పాటు సమంత ఇప్పుడు మరో చిత్రాన్ని కూడా నటిస్తూ నిర్మించబోతున్నట్లు తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన చర్చలు కూడా ముగిసినట్లు టాక్ వినిపిస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. సమంత రూత్ ప్రభు హీరోయిన్‌గా నటించబోయే కొత్త సినిమాలో టాలీవుడ్ టాలెంటెడ్ యంగ్ యాక్టర్ ప్రియదర్శి హీరోగా నటించబోతున్నాడట. ఇందులో వీళ్లిద్దరూ జంటగా చేసే సందడి ఎంతగానో ఆకట్టుకునే విధంగా ఉంటుందని తెలిసింది. ఇక, ఈ చిత్రం రొమాంటిక్ ఫన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుందని అంటున్నారు. దీంతో ఈ కాంబోపై అప్పుడే అందరిలోనూ అంచనాలు ఏర్పడుతున్నాయి. ప్రియదర్శి – సమంత రూత్ ప్రభు కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రాన్ని కొత్త దర్శకుడు రూపొందించబోతున్నాడట. దీన్ని తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో సైతం తెరకెక్కిస్తారనే టాక్ వినిపిస్తోంది. వీళ్లిద్దరితో పాటు ఈ చిత్రంలో ఎంతో మంది పేరున్న నటీనటులు భాగం కాబోతున్నారని సమాచారం.




# హే తారా.. మ్యాజికల్ టచ్‌తో 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' మెలోడీ




యంగ్ హీరో నిఖిల్ ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ముఖ్యంగా స్వయంభూ సినిమా భారీ బడ్జెట్ తో రెడీ అవుతోంది. ఇక దానికంటే ముందు సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న మరో డిఫరెంట్ ఎంటర్‌టైనర్ రానుంది. గతంలో 'స్వామి రారా' మరియు 'కేశవ' లాంటి సినిమాలతో ఈ కాంబినేషన్ మంచి హిట్ ఇచ్చింది. ఇప్పుడు మళ్లీ వీరి కాంబోలో వస్తున్న 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' చిత్రం పైన మంచి అంచనాలు నెలకొన్నాయి. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ ఎల్ పి సంస్థ బ్యానర్ పై బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మాణంలో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇందులో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ తొలిసారిగా తెలుగు తెరకు పరిచయం అవుతోంది. ఆమెతో పాటు, దివ్యాంశ కౌశిక్ మరియు హర్ష చెముడు ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు.

ఇటీవల విడుదలైన టీజర్‌కి మంచి రెస్పాన్స్ రావడంతో సినిమా పైన భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే ఈ రోజు నుంచి మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలయ్యాయి. ప్రత్యేకంగా రూపొందించిన "హే తారా" మెలోడీ సాంగ్ విడుదలైంది. కార్తీక్ అందించిన సంగీతం మరోసారి అందరినీ మాయ చేసింది. కృష్ణ చైతన్య అందించిన సాహిత్యం, ప్రేమికుల మధ్య సున్నితమైన భావాలను వ్యక్తీకరిస్తూ, ప్రేమలో ఉన్న అనుభూతులను మరింత మధురంగా మార్చింది. కార్తీక్ మరియు నిత్యశ్రీల గొంతుతో మరింత అందంగా మారిన ఈ పాట ఇప్పటికే శ్రోతలను కట్టిపడేస్తోంది. నిఖిల్, రుక్మిణి వసంత్ ఈ సినిమాలో తొలిసారి జంటగా కనిపిస్తున్నారు. ఇద్దరి మధ్య ఉన్న కెమిస్ట్రీ తెరపై అద్భుతంగా ఆకట్టుకుంటోంది. వారి మధ్య ప్రేమా, అనుబంధాలను అద్భుతంగా చూపించే ఈ పాట, ప్రేక్షకులకు మరోసారి మ్యూజికల్ ఎక్స్ పీరియెన్స్‌ను అందించింది. అన్నింటికి మించి, కార్తీక్ కంపోజ్ చేసిన ఈ పాటకు సంబంధించిన మ్యూజిక్ ఆడియో ఇప్పటికే పెద్ద ఎత్తున ట్రెండ్ అవుతోంది. లిరిక్స్‌లో ఉండే భావోద్వేగాలు, సంగీతంలో వినిపించే మాధుర్యం ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఇక ఈ పాట సినిమాకు ఓ ప్రత్యేకమైన అద్దం లాంటిదని చెప్పొచ్చు. సినిమా బాక్సాఫీస్ పై భారీ విజయాన్ని అందుకుంటుందనే అంచనాలు ఇప్పటికే ఉన్న నేపథ్యంలో, కార్తీక్ అందించిన మ్యూజిక్ సినిమాకు మరో పెద్ద ప్లస్ అవుతుందనే నమ్మకం అందరిలో ఉంది. ఈ సినిమా నవంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. బాపినీడు బి సమర్పణలో రూపొందిన ఈ సినిమాకు కార్తీక్ సంగీతం అందించగా, సన్నీ ఎమ్ ఆర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను అందిస్తున్నారు.

# అఖండ-2.. నిజంగా తాండవమే!




టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్ లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన మూడు సినిమాలు కూడా బ్లాక్ బస్టర్ హిట్స్ గా నిలిచాయి. అఖండ అయితే వేరే లెవెల్ లో అలరించింది. 2021లో రిలీజ్ అయిన అఖండ మూవీ.. బాలయ్య కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్ల జాబితాలో చేరింది. సినిమాలో నటసింహం ద్విపాత్రాభినయంలో ఆకట్టుకున్నారు. అఖండ్ సీక్వెల్ కోసం సినీ ప్రియులతోపాటు బాలయ్య ఫ్యాన్స్ ఎప్పటి నుంచో వెయిట్ చేస్తున్నారు. అఖండ-2 అద్భుతంగా ఉంటుందని బోయపాటి శ్రీను ఇప్పటికే పలుమార్లు తెలిపారు. ఆ తర్వాత రీసెంట్ గా BB4 పేరుతో అనౌన్స్మెంట్ వచ్చింది. నేడు.. అదే అఖండ-2 తాండవంగా మేకర్స్ ప్రకటించారు. అందుకు సంబంధించిన పూజా కార్యక్రమాలు.. హైదరాబాద్ లోని రామానాయుడు స్టూడియోలో ఏర్పాటు చేశారు. మూవీ టీమ్ తోపాటు బాలకృష్ణ కూతుర్లు నారా బ్రాహ్మణి, తేజస్విని వేడుకలో సందడి చేశారు.

అఖండ సీక్వెల్ కు తేజస్విని సమర్పకురాలిగా వ్యవహరిస్తుండగా.. ముహూర్తపు షాట్ కు బ్రాహ్మణి నేడు క్లాప్ కొట్టారు. ప్రగ్యా జైస్వాల్ హీరోయిన్ గా నటిస్తుండగా.. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై గోపీ అచంట, రామ్ అచంట నిర్మిస్తున్నారు. అఖండకు బాక్సులు బద్దలయ్యేలా అవుట్ పుట్ అందించిన తమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కుతున్న అఖండ-2కు సంబంధించి మేకర్స్ విడుదల చేసిన టైటిల్ థీమ్ ఇప్పుడు వైరల్ గా మారింది. సినీ ప్రియులతో పాటు బాలయ్య అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. రుద్రాక్ష మాలతో స్టార్ట్ టైటిల్ థీమ్ అవ్వగా.. ఆ తర్వాత శివయ్యను, మంచు కొండల మధ్య ఉన్న శివలింగాన్ని చూపించారు. నంది రంకెలేసుకుని రాగా.. బాలయ్య విభూతి పెట్టుకుని సిద్ధమవుతున్నట్లు కనిపించి వేరే లెవెల్ లో అలరించారు. టైటిల్ థీమ్ మొత్తానికి తమన్ ఇచ్చిన బ్లాక్ గ్రౌండ్ స్కోర్, విజువల్స్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాయి. అయితే అఖండ-2.. బాలయ్య తొలి పాన్ ఇండియా మూవీ కావడంతో ఆయన ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు. మంచి అంచనాలు పెట్టుకున్నామని, టైటిల్ థీమ్ తో హోప్స్ పెరిగిపోయాయని చెబుతున్నారు. బ్లాక్ బస్టర్ హిట్ పక్కా అని.. బాలయ్యను బోయపాటి ఈసారి ఎలా చూపిస్తారోనని అంటున్నారు. నిజంగా సినిమా శివ తాండవమేనని కామెంట్లు పెడుతున్నారు. మరి అఖండ-2.. ఫస్ట్ పార్ట్ కు మించిన హిట్ అవుతుందేమో చూడాలి.

# త్రిప్తి.. తృప్తి.. సంతృప్తి..!

గ్లామర్ ఫీల్డ్ లో ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నాం అన్నది కాదు ఎప్పుడు క్రేజ్ తెచ్చుకున్నాం అన్నది ఇంపార్టెంట్. అలాంటి విషయాలు తమకు రావాల్సిన గుర్తింపు లేట్ గా వచ్చిన వారికి బాగా అర్థమవుతుంది. అలాంటి వారిలో కచ్చితంగా బాలీవుడ్ అందాల భామ త్రిప్తి డిమ్రి ఉంటుంది. యానిమల్ సినిమాలో ఛాన్స్ ఆమె ఫేట్ మార్చేసిందని చెప్పొచ్చు. అంతకుముందు కూడా త్రిప్తి సినిమాలు, వెబ్ సీరీస్ లు చేసింది కానీ ఆమెకు సరైన గుర్తింపు రాలేదు. కానీ ఎప్పుడైతే యానిమల్ రిలీజైందో బీ టౌన్ ఆడియన్స్ అంతా త్రిప్తి పేరునే జపించేలా చేసింది. ఆ సినిమాలో హీరోయిన్ గా నటించిన రష్మిక కన్నా త్రిప్తికే ఎక్కువ పాపులారిటీ వచ్చిందని చెప్పొచ్చు. ఇక ఒక్కసారి లైం లైట్ లోకి వచ్చాక ఆఫర్లు వాటంతట అవే వచ్చేస్తాయి. అందులో భాగంగానే త్రిప్తి వరుస అవకాశాలు అందుకుంటుంది. యానిమల్ తర్వాత తన కెరీర్ పరంగా వేగాన్ని పెంచుకున్న త్రిప్తి



సినిమాల సక్సెస్ రేటు ఎలా ఉన్నా తన పేరు వినిపించేలా చేసుకుంటుంది. ఇక సినిమా ఫలితాలు ఎలా ఉన్నా వాటితో పాటు సోషల్ మీడియా ఫోటో షూట్స్ తో కూడా త్రిప్తి ఇంప్రెస్ చేస్తుంది. తన మార్క్ గ్లామర్ షో చేస్తూ త్రిప్తి తన ఫాలోవర్స్ ని సంతృప్తి చెందేలా చేస్తుంది. లేటెస్ట్ గా అద్దం ముందు చీరందంతో అమ్మడు చేస్తున్న గ్లామర్ షో ఆడియన్స్ కు పిచ్చెక్కిస్తుందంటే నమ్మాల్సిందే. తన చూపులతో త్రిప్తి చేస్తున్న క్రేజీ స్కిన్ షో కుర్రాళ్ల మతులు పోగొతుంది. సినిమాల లెక్క ఎలా ఉన్నా అమ్మడికి వచ్చిన ఈ ఫాలోయింగ్ కి ఇలా ఫోటో షూట్స్ చేసినా చాలు అనిపించేలా కనిపిస్తుంది. బాలీవుడ్ లో సినిమా వెంట సినిమా చేస్తున్న త్రిప్తి సౌత్ సినిమా ఆఫర్లు వస్తున్నా ఎందుకో అమ్మడు ఆలోచిస్తుందని తెలుస్తుంది. ముఖ్యంగా తెలుగు మేకర్స్ త్రిప్తిని తెలుగులో నటింప చేయాలని ఉత్సాహంగా ఉన్నారు. మరి అది ఏ సినిమా అవుతుంది అన్నది చూడాలి. ఏది ఏమైనా త్రిప్తి ఇదివరకు కెరీర్ కన్నా యానిమల్ తర్వాత ఆమె ఉత్సాహంతో పనిచేస్తుంది. ఈ టైం లో టాలీవుడ్ ఆఫర్ కూడా వస్తే త్రిప్తి రేంజ్ మరింత పెరిగే ఛాన్స్ ఉంటుంది.

# డెనిమ్ షార్ట్ లో అందాల ఈషా

సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే నటి ఈషా రెబ్బా, తాజాగా షేర్ చేసిన ఫోటోలు మరోసారి అభిమానులను ఆకట్టుకున్నాయి. "%వీవ ఖఅఒ ఎఎ ఝతీఎ ఎఱతీతీశీతీ జఱఎవం%" అంటూ క్యాప్షన్ పెట్టిన ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఫోటోల్లో ఈషా సింపుల్ టీషర్ట్, డెనిమ్ షార్ట్ ధరించి, తన ఫిట్‌నెస్ పై కృషిని స్పష్టంగా చూపిస్తున్నారు. ఆ మధ్య జిమ్ లో వర్కౌట్స్ చేసిన తర్వాత తీసిన కొన్ని ఫొటోలు బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. ఫోటోలలో ఆమె ముఖంపై చెమట కనబడటం, ఫిట్ గా ఉండేందుకు ఆమె ఎంత కష్టపడుతున్నారో చెప్పకనే చెబుతోంది. ఇక ఇప్పుడు అమ్మడు మరోసారి ఆ రేంజ్ లో



లెగ్స్ అందాలతో షాక్ అయ్యేలా స్టిల్ ఇచ్చింది. ఈషా తన అందంతో పాటు ఫిట్‌నెస్ విషయంలో కూడా ఎంతో కసరత్తులు చేస్తోంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ, తన అందంతోనూ, టాలెంట్ తోనూ ఆమె తమిళం సహా ఇతర భాషల్లో కూడా అవకాశాలు అందుకుంటోంది. వెబ్ సిరీస్ లలో నటిస్తూ కొత్త అవెన్యూస్ ను అన్వేషిస్తోంది. అయితే మంచి కాంటెంట్ ఉన్న క్యారెక్టర్ దొరికితే గ్లామరస్ పాత్రలు చేయడానికి ఇబ్బంది లేదని అమ్మడు గతంలోనే క్లారిటీ ఇచ్చింది. ఇక ఇప్పుడు ఫొటోలతో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ఈషా ఆమధ్య "దయా" అనే వెబ్ సిరీస్ లో డీ గ్లామర్ లుక్ లో కనిపించి ప్రశంసలు అందుకుంది. అందులో నిండు గర్భిణిగా నటించి, తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ఇక ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఈషా రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేస్తూ, అభిమానులను మరింత దగ్గరగా చేసుకుంటుంది. ఈ సారి న్యూ లుక్ లో ఆమె సింప్లిసిటీతో పాటు, ఫిట్‌నెస్ పై ఉన్న ప్రేమను కూడా మరోసారి నిరూపించింది.



## భారాస, కాంగ్రెస్ ప్రభుత్వాలకు తేడా లేదు: బండి సంజయ్

కరీంనగర్: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 వల్ల గ్రూప్-1 అభ్యర్థులకు నష్టం జరుగుతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమేనని విమర్శించారు. ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై లాఠీఛార్జ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. 15వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి.. 60వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామంటున్నారని, గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి ఏం తేడా లేదని విమర్శించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. "కేసీఆర్ ఆలోచనా విధానాలకు అనుగుణంగానే ఈ ప్రభుత్వం నడుస్తోంది. ఈ ప్రభుత్వానికి ఉద్యోగాలు భర్తీ చేసే ఆలోచన లేదు. ప్రణాళిక ప్రకారమే జీవో 29 ఇచ్చారు. నిరుద్యోగుల ఉసురు తగిలే భారాస ఓడిపోయింది. నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత ఆ పార్టీకి లేదు. ప్రశ్న పత్రాలు లీకేజీ చేసి నిరుద్యోగుల భవిష్యత్‌ను భారాస నాశనం చేసింది" అని బండి సంజయ్ మండిపడ్డారు.

## రూ.25వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేయవచ్చు: కేటీఆర్



హైదరాబాద్: రూ. 25వేల కోట్లతో మూసీ ప్రక్షాళన చేయవచ్చని, మూసీ సుందరీకరణకు రూ. 1.50లక్షల కోట్లు ఎందుకని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండానే మూసీని ప్రక్షాళన చేయవచ్చన్న ఆయన .. గత ప్రభుత్వాలు మూసీని మురికి కూపంలా మార్చాయన్నారు. 31 ఎస్టీపీలు పూర్తయితే మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహిస్తుందని.. ఎస్ఎన్‌డీపీని ప్రారంభించడం వల్లే మురికినీరు నిల్వ ఉండటం లేదన్నారు. మూసీ ప్రక్షాళనపై తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కేటీఆర్.. మళ్లీ తమ ప్రభుత్వం వచ్చి ఉంటే రెండో దశ ఎస్ఎన్‌డీపీని ప్రారంభించేవాళ్లమన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రెండో దశ ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టును రద్దు చేసిందని ఆరోపించారు. తుది దశలో ఎస్టీపీలు, సీనరేజి ప్లాంట్‌లు ఉన్నాయని గుర్తు చేశారు. కేవలం రూ. 1100 కోట్లతో నల్గొండకు శుద్ధమైన నీరు ఇవ్వొచ్చని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిందే భారాస ప్రభుత్వం అని తెలిపారు. కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. రూ.లక్షన్నర కోట్ల లూటీని తెలంగాణ సమాజం గమనిస్తోందని, దిల్లీకి మూటలు పంపేందుకే మూసీపై సీఎం ప్రేమ ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రాంతంలో సర్వే చేయకున్నా.. చేసినట్టు చెప్పారన్నారు. ప్రజలను అబద్ధాలతో మభ్యపెట్టేందుకు సీఎం యత్నించారని ఆరోపించారు.

## యాదగిరిగుట్టలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



హైదరాబాద్: యాదగిరిగుట్టలో భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆలయంలో 14చోట్ల మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. 47 చోట్ల టాయిలెట్స్ నిర్మించినట్లు చెప్పారు. విష్ణు పుష్కరిణీ గుండాన్ని ఏర్పాటు చేశామన్నారు. చంటి బిడ్డ తల్లులకు ప్రత్యేక లాంజ్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల సౌకర్యం కల్పించామని చెప్పారు. రూ. 15కోట్లతో దాతల సహాయంతో అన్నదాన సత్రం నిర్మించామని మంత్రి కొండా సురేఖ అన్నారు. 60కిలోల బంగారు తాపడంతో రాజగోపురం నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. లడ్డూ నాణ్యతలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. భద్రాద్రి అభివృద్ధి కోసం కొత్త మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అన్నారు. రూ. 3కోట్లతో జానకి సదనం నిర్మిస్తున్నామని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన 24సేవలు ఆన్ లైన్?లో అందిస్తున్నామని ప్రకటించారు. వేములవాడ దేవస్థానానికి చెందిన 850కోడెలను రైతులకు అందించినట్లు మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. వీటీడీఏకు ప్రభుత్వం రూ. 70 కోట్లు విడుదల చేసిందని ప్రకటించారు. వెండి పల్లకీలు, బంగారు తాపడం రాజగోపురం నిర్మించాలని నిర్ణయించామన్నారు. రూ. 110కోట్లతో బాసర ఆలయ పునర్నిర్మాణం చేస్తామన్నారు. అందుకోసం మాస్టర్ ప్లాన్ సిద్ధమైందని అన్నారు. ఆదాయం ఆధారంగా ఆలయాల వర్గీకరణ చేస్తామని వివరించారు. వివాదంలో ఉన్న దేవాదాయ, అటవీ శాఖ భూములపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

## మూసీ సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: డ్రైనేజీ సమస్య పరిష్కారం కాకుండా మూసీ సుందరీకరణ జరగదని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని 30 శాతం జనాభా హైదరాబాద్‌లోనే ఉందన్నారు. మూసీ సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. ఇప్పుడున్న మూసీకి రెండువైపులా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి అభివృద్ధి చేయవచ్చని సూచించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చవద్దని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ ఎక్స్ రోడ్‌లో స్థానిక ఎమ్మెల్యే గోపాల్‌తో కలిపి సేవరేజ్ లైన్‌ను కిషన్ రెడ్డి ప్రారంభించారు. 'మూసీ సుందరీకరణ పనులు చేయండి.. మూసీ పక్కన ముఖ్యమంత్రి ఇల్లు కట్టండి' మాకేమీ అభ్యంతరం లేదని ఎద్దేవా చేశారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తాం.. రూ. 25వేలు ఇస్తాం.. ఖాళీ చేయమనడం న్యాయం కాదని హితవు పలికారు. స్థానిక ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చని సూచించారు.




## నల్గొండ ప్రజలకు మేలు జరగాలంటే మూసీ ప్రక్షాళన తప్పనిసరి: గుత్తా సుఖేందర్‌రెడ్డి

హైదరాబాద్: నల్గొండ జిల్లా ప్రజలకు మేలు జరగాలంటే మూసీ ప్రక్షాళన తప్పనిసరి అని తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను అందరూ అభినందించాలని చెప్పారు. ప్రజలకు మంచి చేసే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేపట్టిందని.. దీనిపై విమర్శలు సరి కాదన్నారు.

## రైతుల భూములను బలవంతంగా లాక్కున్నారు.. హరీష్?రావుపై అడ్లూరి లక్ష్మణ్ ధ్వజం

హైదరాబాద్: రైతుల కడుపు కొట్టి రెండు పంటలు పండే భూములను మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు బలవంతంగా లాక్కున్నారని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ విమర్శలు చేశారు. రైతుల పొట్టకొట్టిన ఆ నాటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డికి కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని విమర్శించారు. మల్లన్న సాగర్ గ్రామాల్లో పోలీస్ పికెటింగ్‌ల మధ్య గ్రామసభలు పెట్టారని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్?లో అడ్లూరి లక్ష్మణ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్?పై అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుల భూములను కేసీఆర్, హరీశ్‌రావులు బలవంతంగా లాక్కున్నారని అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. భూనిర్వాసితుల సమస్యలపైన హరీశ్‌రావుతో చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. హరీశ్‌రావు టైం, డేట్ ఫిక్స్ చేయాలని సవాల్ విసిరారు. సిద్దిపేట అంబేద్కర్ విగ్రహం దగ్గర బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. మల్లన్నసాగర్?పైన చర్చించడానికి కేసీఆర్‌ను హరీశ్‌రావు తీసుకువస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చకు వస్తారని అడ్లూరి లక్ష్మణ్ చెప్పారు. కేసీఆర్ ఎప్పుడు వస్తారో డేట్, టైం చెబితే సీఎం రేవంత్ రెడ్డి చర్చించడానికి వస్తారని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేట, గజ్వేల్, చొప్పదండి, ధర్మపురి.. ఎక్కడైనా చర్చకు తాము సిద్ధమని అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. ధర్మపురిలో కాళేశ్వరం లింక్ 2 నిర్వాసితుల సమస్యలపైన హరీశ్‌రావుతో చర్చకు తాను సిద్ధమని అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. హరీశ్‌రావు పదే పదే అబద్ధాలు చెప్పి నిజం చేయాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. భూనిర్వాసితుల పాపం వట్టిగా పోదని ఆక్షేపించారు. మలన్న సాగర్?లో కేసీఆర్, హరీష్ రావు చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. పరిహారం అడిగిన రైతులపై, నాయకులపైన కేసులు పెట్టారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ అరాచకాల కారణంగా మల్లన్న సాగర్‌లో మల్లారెడ్డి అనే రైతు తన సొంత ఇంట్లో ఆత్మాహుతి చేసుకున్నారని అడ్లూరి లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం చేశారు. లోక్?సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఏం గతి పట్టిందో అందరికీ తెలుసునని అన్నారు. పోలింగ్ జరుగుతుండగానే బీఆర్ఎస్ అస్త్రసన్యాసం చేసిందని అడ్లూరి లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.



## తెలంగాణలో 9 యూనివర్సిటీలో వీసీల నియామకం

హైదరాబాద్, అక్టోబర్ 18: రాష్ట్రంలో తొమ్మిది విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్‌లు నియమితులయ్యారు. వైస్ ఛాన్సలర్‌ల నియామకపత్రాలపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకాలు చేశారు. దీంతో వీసీలను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. .

**వైఎస్ చాన్సలర్లు ఎవరంటే...** 1. ప్రొఫెసర్ జి ఎన్ శ్రీనివాస్ – మహబూబ్‌నగర్, పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ 2. ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి – కాకతీయ యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ 3. ప్రొఫెసర్ కుమార్ మొగ్లారామ్ – హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్ 4. ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ – శాతవాహన యూనివర్సిటీ, కరీంనగర్‌కు వైస్ ఛాన్సలర్ 5. ప్రొఫెసర్ నిత్యానందరావు – హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ 6. ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ – నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ 7. ప్రొఫెసర్ యాదగిరిరావు – తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్‌కు వైస్ ఛాన్సలర్ 8. ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య – జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, హైదరాబాద్‌కు వైస్ ఛాన్సలర్ 9. ప్రొఫెసర్ రాజి రెడ్డి – శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్

**దాదాపు ఏడాది కాలంగా...** కాగా.. తెలంగాణలో చాలా కాలంగా వీసీల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర కాలంగా వీసీలు లేకుండా పోయారు. అంతేకాదు ఇన్‌చార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించినప్పటికీ వర్సిటీలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. వీసీలు లేక అనేక యూనివర్సిటీల్లో పాలన గాడి తప్పినట్లైంది. పలు వర్సిటీల్లో అక్రమాలు జరిగాయని కూడా ఆరోపణలు వచ్చాయి. సరైన వసతులు లేక అనేక సార్లు విద్యార్థులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. తమ సమస్యలు పరిష్కరించాలని కొత్త వీసీలను నియమించాలని విద్యార్థులు పట్టుబట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వసతి గృహాల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. హాస్టల్స్‌లో సరైన భోజన సదుపాయం లేక, నాణ్యమైన ఆహారం లేక విద్యార్థులు అవస్థలు పడ్డ సందర్భాలు ఎన్నో. అంతేకాకుండా హాస్టల్స్‌లో విషపు పురుగులు తిరుగుతుండటంతో విద్యార్థులు మరింత భయాందోళనకు గురైన పరిస్థితులు ఉన్నాయి. అలాగే వీసీ పోస్టుల కోసం అనేక మంది ప్రొఫెసర్లు పైరవీలు చేసినట్లు సమాచారం. చివరకు ఎట్టకేలకు వీసీల నియామకంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త వీసీల ఆధ్వర్యంలో యూనివర్సిటీల్లో పరిస్థితి ఎలా ఉండబోతుందో చూడాలి మరి.

## సీఎం రేవంత్ వ్యాఖ్యలపై హరీష్ ఏ రేంజ్‌లో సవాల్ విసిరారంటే




హైదరాబాద్, అక్టోబర్ 18: మూసీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. "రేవంత్ రెడ్డి సవాలుకు సిద్ధం. రేపు రమ్మంటావా.. ఎల్లుండి రమ్మంటావా. సెక్యూరిటీ లేకుండా వస్తా అన్నావ్. పోదాం పదా. డేట్, టైం మీరే చెప్పండి, కారు డ్రైవింగ్ చేసుకుంటూ ఇద్దరమే పోదాం. లేదంటే రేపు ఉదయం 9 గంటలకు నేను సిద్ధం. ముందు మూసీ నిర్వాసితుల వద్దకు, ఆ తర్వాత ఆర్‌అండ్‌ఆర్ కాలని, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ కట్ట మీదకు పోదాం అక్కడే కూర్చొని మాట్లాడుదాం" అంటూ మాజీ మంత్రి సవాల్ విసిరారు. సీఎం రేవంత్ సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 2013 చట్టానికి మించిన ప్రయోజనాలు మల్లన్న సాగర్ ప్రజలకు ఇచ్చింది బీఆర్ఎస్ పార్టీ అని చెప్పుకొచ్చారు. పేదల ఇళ్ళను కూల్చటాన్ని మాత్రమే బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్నటి సీఎం మాటలతో అబద్ధం కూడా ఆశ్చర్యపోయిందన్నారు. ప్రజల దృష్టిని మరల్చడం కోసమే సీఎం రేవంత్ మూసీ అంశాన్ని తీసుకొచ్చారన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చటంలో కాంగ్రెస్ చతికిలపడిందని విమర్శించారు. నదీ జలాల శుద్ధితో మూసీ నది పునర్జీవ ప్రక్రియ మొదలు పెట్టాలన్నారు. మొదట మూసీ నదిలో వ్యర్థాలు వచ్చి చేరకుండా అడ్డుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చారని మండిపడ్డారు. మూసీలో గోదావరి నీళ్ళను కలపటానికి డీపీఆర్ కూడా సిద్ధమైందని తెలిపారు. గుజరాత్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్నారు.

**ఇంతకీ సీఎం ఏమన్నారంటే...** మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి కీలక కామెంట్స్ చేశారు. తెలంగాణ భవిష్యత్‌ను నిర్దేశించే ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టిందన్నారు. 33 బృందాలు మూసీ పరివాహకంపై అధ్యయనం చేశాయని సీఎం తెలిపారు. మూసీ పరివాహకంలో నివసిస్తున్న వారు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని.. అలాంటి వారికి మెరుగైన జీవితం అందించాలని భావిస్తున్నామన్నారు. విషవలయంలో పేదలు ఉండాలనేది కొందరి ఆలోచన అంటూ విపక్షాలపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు సీఎం రేవంత్. భూగరిష్ట పరిమితి చట్టాన్ని వ్యతిరేకించిన వర్గం కూడా దేశంలో ఉండేదన్నారు. పేదలు ఎప్పుడూ పేదలుగానే ఉండాలని దొరలు, భూస్వాములు భావిస్తారన్నారు. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు రాష్ట్రాన్ని దోచుకున్నారని సీఎం ఆరోపించారు. తాము చేపడుతున్నది మూసీ సుందరీకరణ కాదని.. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమం అని చెప్పారాయన. కొందరి మెదడులో మూసీలో ఉన్న మురికి కంటే.. ఎక్కువ విషం నింపుకున్నారంటూ విపక్ష నేతలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విషపూరిత ఆలోచనలతోనే మూసీ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇదే సమయంలో ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ, కిష్టాపూర్ ఎక్కడికైనా.. సెక్యూరిటీ లేకుండా తానువ స్తానని అన్నారు. విపక్ష నేతలు కూడా రావాలని సవాల్ విసిరారు.

అక్కడ రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిద్దామన్నారు. "మల్లన్నసాగర్, కొండపోచమ్మ వద్దని ప్రజలు అడ్డుకోలేదా? ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించి ప్రాజెక్టులు నిర్మించ లేదా? మూసీ సుందరీకరణకు ప్రణాళికలు రూపొందించామని కేటీఆర్ అనలేదా? అడ్డుకుంటున్న నేతలు 3 నెలలు మూసీ ఒడ్డున జీవించాలి. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల మూడునెలలపాటు మూసీ ఒడ్డున ఉండాలి. వాళ్లు ఉంటానంటే కావాల్సిన వసతులు అన్నీ కల్పిస్తాం. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల 3 నెలలు అక్కడ ఉంటే.. ఈ ప్రాజెక్టును ఆపేస్తాను" అని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

## కొండా సురేఖపై పరువు నష్టం కేసు.. సోమవారం వాంగ్మూలం ఇవ్వనున్న కేటీఆర్



హైదరాబాద్: మంత్రి మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం వాంగ్మూలం ఇవ్వనున్నారు. షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రజాప్రతినిధుల కోర్టు నమోదు చేయాల్సి ఉన్నది. అయితే వాగ్మూలం ఇచ్చేందుకు కేటీఆర్ సోమవారం కోర్టుకు హాజరవుతారని తెలుస్తున్నది. సెక్షన్ 356 బీఎన్ఎస్ ప్రకారం కేటీఆర్ వాంగ్మూలం కీలకంగా మారనుంది. ఇటీవల గాంధీ జయంతి సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ సినీ నటి సమంత విడాకులపై నిరాధార ఆరోపణలు చేసిన వీడియో క్లిప్పింగ్‌లు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలు, పత్రికల్లో వచ్చిన వార్తలను నిక్షిప్తం చేసిన పెన్‌డ్రైవ్‌ను, ఫొటోలను సాక్ష్యాధారాలుగా కోర్టుకు సమర్పించారు.

## మూసీ నిర్వాసితులకు చెక్కులు అందజేసిన మంత్రి సీతక్క..

హైదరాబాద్: మూసీ నిర్వాసితులను తరలించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు సహా జీవనోపాధి మెరుగుపరచుకునేందుకు రుణాల రూపంలో నగదు అందజేస్తోంది. ఈ మేరకు మూసీ పునరావాస మహిళా సంఘాలకు కాంగ్రెస్ సర్కార్ రుణాలు మంజూరు చేసింది. వీటిని సంబంధించిన చెక్కులను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అందజేశారు. 17 స్వయం సహాయక మహిళా సంఘాలకు చెందిన 172మంది మహిళలకు రూ. 3.44 కోట్ల విలువైన చెక్కులను మంత్రి సీతక్క పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. " ఒక ప్రాంతం నుంచి మరొక చోటుకు వెళ్లేటప్పుడు కొంత కష్టంగానే ఉంటుంది. కానీ వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

మూసీ నది వరద ఉధృతి పెరిగితే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు దేశంలో సంభవిస్తున్నాయి. మంచి వాతావరణంలో మనం జీవించాలి. మంచి గాలి, నీళ్లు దొరికే ప్రదేశంలో జీవనం సాగించాలి. ఒక తరం మూసీ నదీ పరివాహక ప్రాంతంలో ఇబ్బందుల్లో నివసించారు. రేపటి తరమైన మంచి వాతావరణంలో బతికేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. మహిళా గ్రూపులలో ఒక్కో మహిళలకు రూ. 2లక్షలు రుణంగా ఇస్తున్నాం. రూ. 2 లక్షల్లో రూ. 1.40లక్షలు ప్రభుత్వం మాఫీ చేస్తుంది. కేవలం రూ. 60వేలు మాత్రమే మహిళా సంఘాలు కట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం సహాయంతో మంచి వ్యాపారాలు చేసుకోవాలి. కుట్టు మిషన్లను సైతం మూసీ నది మహిళా సంఘాలకు ఇస్తాం. వివిధ రకాల వ్యాపారాలకు మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తాం. పునరావాసం పొందిన వారి పిల్లలకు అన్ని రకాల విద్యా సదుపాయాలను కల్పిస్తున్నాం" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం ఎమ్మెల్యేలు బలాలా, కౌసర్ మోయినుద్దీన్, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com